స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com
PRGI NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 144 | సోమవారం, అక్టోబర్ 12, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 12 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 144 | MONDAY, OCTOBAR 12, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 12 | RS : 5-00 |


## నిర్బంధం వద్దు

- ట్రాఫిక్, మెట్రోపై ఇష్టారాజ్యంగా ఆంక్షలు చెల్లవు.. అత్యవసరమైతేనే బారికేడ్లు
- ఇంటర్నెట్‌కు అంతరాయం కలిగించవద్దు
- పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటం మా బాధ్యత
- లాయర్లు, జర్నలిస్టులకు అడ్డంకులు కలిగించొద్దు: సుప్రీం

2 లో..





# బీజేపీ రావణుడైతే.. కాంగ్రెస్ రాముడు

- గోవాను డ్రగ్స్ స్టోర్‌గా మార్చిన బీజేపీ..
- బీజేపీని నమ్మి ఇక్కడి ప్రజలు రెండుసార్లు మోసపోయారు
- మళ్లీ ఆ పార్టీని నమ్మొద్దు..
- ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్.. ప్రాపర్టీ సావంత్..
- గోయ్ రఖోన్స్ యాత్రలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా

పనాజీ/హైదరాబాద్, అక్టోబరు 11 (వార్త వేదిక సూర్య):

భారత రాజకీయాల్లో బీజేపీని రావణాసురునిగా, కాంగ్రెస్ పార్టీని శ్రీరామునిగా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రావణుడిని ఓడించేందుకు రామునికి మద్దతుగా నిలబడాలని గోవా ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీని నమ్మి గోవా ప్రజలు రెండు సార్లు మోసపోయారని, మరోసారి మోసపోవద్దని సూచన చేశారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను ప్రాపర్టీ సావంత్ అంటూ ఎద్దేవా చేశారు. గోవా భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడుకోవడమే లక్ష్యంగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ విభాగం సెప్టెంబరు 22 నుంచి నిర్వహిస్తున్న గోయ్ రఖోన్స్ యాత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. చీఫెన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండ్ వరకు సాగిన యాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఢిల్లీలో నిరసన కార్యక్రమాల నేపథ్యంలో రాహుల్ గాంధీ గోవాకు రాలేకపోయారని, దాంతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనను రాహుల్ గాంధీ ప్రతినిధిగా తనను పంపారని రేవంత్ రెడ్డి చెప్పారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తుంటే.. ప్రధాని మోదీ ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆరోపించారు. ఇప్పటికే గోవాలో రెండు సార్లు బీజేపీని గెలిపించి మోసపోయిన ప్రజలు.. ఆ పార్టీ పాలనతో విసిగి పోయారన్నారు. ఇక్కడ మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే.. గోవా ప్రజలు మిగతా 2లో..

# యాసంగి 'వరి' వద్దే వద్దు

## ఎల్‌నినోతో జల సంక్షోభం.. రెండో పంట వేసి ఇబ్బంది పడొద్దు

- రైతులు ఆచితూచి నిర్ణయం తీసుకోవాలి
- తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం కృషి
- విద్యుత్తు కొరతతో పెరుగుతున్న ఇబ్బందులు
- తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ కోరతాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):

ఎల్‌నినోతో రాష్ట్రంలో సాగునీటి వనరుల సంక్షోభ పరిస్థితులున్నందు వల్ల యాసంగి పంటగా వరి సాగు చేసి, ఇబ్బందులు పడొద్దని రైతులకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఖరీఫ్ వరిపంటను కాపాడేందుకు ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పర్యటించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల తర్వాత కూసుమంచిలో జరిగిన సభలో మాట్లాడారు. యాసంగి పంటగా వరి సాగు చేస్తే.. నీరందక ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితిని తెచ్చుకోవద్దని సూచించారు. ఎల్‌నినోతో విద్యుత్ కొరత తీవ్రమైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో జల వనరులపై ఒత్తిడి పెరిగే పరిస్థితులు నెలకొంటున్నాయని, ప్రజలు, మిగతా 2లో..

## జూన్ నాటికి సమీకృత పాఠశాల అందుబాటులోకి రావాలి

- పాన్నెకల్‌లో పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణం
- నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
- పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

# పెను విషాదం

## ఆఫ్రికా తీరంలో వలసదారుల పడవ బోల్తాపడి 109 మంది మృతి

- మృతుల్లో 15 మంది చిన్నారులు
- మరో 116 మందికి పైగా గల్లంతు
- గల్లంతైన వారి కోసం ముమ్మరంగా గాలింపు



జిబౌటి: మెరుగైన భవిష్యత్తు కోసం విదేశాలకు వలస వెళుతున్న వారి జీవితాలు సముద్రంలో విషాదాంతమయ్యాయి. ఆఫ్రికా తీరంలో వలసదారులతో ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడిన ఘటనలో 109మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15మంది చిన్నారులు ఉండ టం తీవ్ర విషాదాన్ని నింపింది. మరో 116మందికి పైగా గల్లంతైనట్లు అంత ర్జాతీయ వలసల సంస్థ ఆదివారం వెల్లడించింది. సుమారు 350 మందితో ప్రయాణిస్తున్న పడవ ప్రమాదానికి గురికా వడంతో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవించింది. సముద్రంలో గల్లంతైన వారి కోసం జిబౌటి అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అక్టోబర్ 8, 9 తేదీల మధ్య రాత్రి సమయంలో వలసదారులతో కూడిన పడవ జిబౌటి నుంచి యెమెన్‌కు బయలుదేరింది. జిబౌటి లోని ఒబాక్ నౌకాశ్రయ పట్టణానికి ఉత్తరాన ఉన్న గుహెరే ప్రాంతానికి సమీపంలోకి చేరుకోగానే పడవ బోల్తా పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 109 మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో 52మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. చిన్నారుల్లో తొమ్మిది మంది బాలికలు, మిగతా 2లో..

# తమిళనాడు అభివృద్ధికి విజయ్‌తో కలిసి పనిచేస్తా

## చెన్నైలో మెట్రో రైలు సేవలు ప్రారంభం

- 14.64 కిలోమీటర్ల మార్గంలో రైళ్ల రాకపోకలు
- 11 ఎత్తైన మెట్రో స్టేషన్లు ప్రజలకు అందుబాటులోకి
- ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి ప్రధాని ప్రయాణం



చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించే దిశగా మెట్రో రైలు సేవలు ప్రారంభమయ్యాయి. చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలోని నాలుగో మార్గానికి చెందిన తొలి భాగంలో 14.64 కిలోమీటర్ల పొడవున నిర్మించిన ఎత్తైన మార్గంలో రైళ్ల రాకపోకలను ప్రారంభించారు. పూవిరుందవల్లి బైపాస్ మెట్రో స్టేషన్ నుంచి వడపళని మెట్రో స్టేషన్ వరకు ఈ మార్గం విస్తరించి ఉంది. చెన్నై పోరూరు బైపాస్ మెట్రో స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజ య్ సమక్షంలో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. రెండో దశలో భాగంగా నిర్మించిన ఈ మార్గం ద్వారా ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి రానుంది. పూవిరుందవల్లి బైపాస్ నుంచి వడపళని వరకు ఉన్న 14.64 కిలోమీటర్ల ఎత్తైన మార్గంలో మొత్తం 11 మెట్రో స్టేషన్లను ప్రజల మిగతా 2లో..




# విద్యార్థుల సందేహాల నివృత్తికి కృత్రిమ మేధ

- బ్రిలియన్స్ ఏఐని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు
- విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన
- నూతన ఆవిష్కరణలకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం
- ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

విద్యార్థులు చదువులో ఎదుర్కొనే సందేహాలను నివృత్తి చేసుకోవడంతోపాటు తమకు అనుకూలమైన వేగంతో పాఠాలను నేర్చుకొని, పరీక్షలకు మరింత ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యేందుకు ఉపయోగపడే బ్రిలియన్స్ ఏఐ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని రాష్ట్ర ఐటీ, మిగతా 2లో..

మునుగోడు తాగు, సాగునీటి విషయంలో
# రాజీపడేది లేదు

- ఫ్లోరైడ్ బాధితులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం
- డిండి ఎత్తిపోతల పథకంపై విశ్రాంత ఇంజనీర్లతో సమీక్ష
- రూ.1,800 కోట్లతో నీటి తరలింపు పనులకు ప్రణాళిక
- లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లపై ప్రత్యేక దృష్టి
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):

మునుగోడు నియోజకవర్గ ప్రజల తాగునీరు, సాగునీటి అవసరాలను తీర్చే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫ్లోరైడ్ సమస్యతో ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంతోపాటు రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించి తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రతినిధులతో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే ప్రతిపాదన, లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లకు సంబంధించిన పనుల పురోగతి, భూసేకరణ, నిర్మాణపరమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టాల్సిన డిండి ఎత్తిపోతల మిగతా 2లో..



# రూ.74 కోట్లతో రహదారులు

- రెండు కీలక రహదారుల విస్తరణ పనులకు శంకుస్థాపన
- తెల్లకంటిగూడెం నుంచి ముషంపల్లి వరకు రూ.41 కోట్లు
- చెట్ల చెన్నారం రహదారికి రూ.33 కోట్లు
- గ్రామీణ ప్రాంతాలకు మెరుగుపడనున్న రవాణా సౌకర్యాలు

నల్గొండ, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):

నల్గొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక రహదారుల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రెండు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడం, ప్రజల ప్రయాణ ఇబ్బందులను తగ్గించడం ఈ పనుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి రావడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, స్థానిక మిగతా 2లో..

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY సంపుటి:2 | సంచిక: 144 సోమవారం 12 అక్టోబర్, 2026

## పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

ఆరుగురు బాలురు ఉన్నారు. మెరుగైన ఉపాధి, భవిష్యత్తుపై ఆశలతో సముద్ర ప్రయాణం సాగించిన వీరు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ తెలిపింది. వారంతా ఇథియోపియా దేశానికి చెందినవారేనని వెల్లడించింది. వీరిలో 64 మందికి ఒబాక్‌లోని వలసదారుల సహాయ కేంద్రంలో ఆశ్రయం కల్పించి, అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు సముద్రంలో గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు జిబౌటి అధికారులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. బాధితులను గుర్తించడం, ప్రాణాలతో బయటపడిన వారికి అవసరమైన సహాయం అందించడం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. అయితే పడవ ఎందుకు బోల్తా పడిందనే విషయంపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై జిబౌటిలోని అంతర్జాతీయ వలసల సంస్థ ప్రతినిధి అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ స్థాయిలో ప్రాణనష్టం జరగడం హృదయ విదారకమని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో వేలాది మంది వలసదారులు ఈ సముద్ర మార్గాన్ని ఎంచుకుంటున్నారని, అయితే ప్రయాణంలో ఎదురయ్యే ప్రమాదాలు వారి ప్రాణాలను బలిగొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు, మెరుగైన జీవన పరిస్థితుల కోసం స్వదేశాలను విడిచిపెడుతున్నవారు అక్రమ రవాణాదారులపై ఆధారపడటం, ప్రమాదకరమైన పడవల్లో ప్రయాణించడం వంటి కారణాలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సరైన భద్రతా ఏర్పాట్లు లేకుండా సాగుతున్న ఇటువంటి ప్రయాణాలు వలసదారుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

## నిర్బంధం వద్దు

న్యూఢిల్లీ: ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పౌరులు, ప్రతిపక్ష నాయకుల తోపాటు న్యాయవాదులపైనా పోలీసులు అణ చివేత ధోరణి ప్రదర్శించడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. నిరసనకారులను చట్టవిరుద్ధంగా నిర్బంధించడం గానీ, ప్రజా రవాణాను ఇష్టారాజ్యంగా నిలిపివేయడం గానీ చేయకూడదని తేల్చిచెప్పింది. 10వ తేదీ న ఢిల్లీలో జరిగిన దాన్ని చిన్నవిషయంగా చూ డటం లేదని పేర్కొంది. ట్రాఫిక్, మెట్రోపై ఇష్టారాజ్యంగా ఆంక్షలు చెల్లవని, పౌరుల స్వేచ్ఛా రాకపోకలను అనుమతించాలని ఆదే శించింది. అవసరమైన చోటే బారికేడ్లు పెట్టి, మిగతా వాటిని తొలగించాలని స్పష్టం చే సింది. ఇంటర్నెట్‌కు అంతరాయం కలిగించ వద్దని ఆదేశించింది. మెట్రోస్టేషన్లను మూసివేయవద్దని తాము ఆదేశించినా, ఎందుకు మూ సివేశారని ప్రశ్నించింది. ఇది కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కిందకు ఎందుకు రాదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. తదు పరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఢిల్లీలో మెట్రో, రైల్వే సర్వీసుల రద్దు, నిరసనకారుల అణచివేతపై పదుల సంఖ్యలో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బాగ్చి, జస్టిస్ మోహనలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ''మెట్రోలో ఒక మార్గంలో ప్రారంభ, చివరి స్టేషన్లను మాత్రమే తెరిచి.. మధ్యలో మూసివేస్తే రాకపోకలు ఎలా? ఏయే స్టేషన్లు తెరిచి ఉన్నాయి, ఏవి మూసేశారనే వివరాలను స్పష్టంగా మ్యాప్ ద్వారా నివేదికలో ఇవ్వండి'' అని అధికారులను ధర్మాసనం ఆదేశించింది. పోలీసులు నిరసనకారులపై విచక్షణారహితంగా బలాన్ని ఉపయోగించారని, నేమ్‌బ్యాడ్జీలు కూడా పెట్టుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మహిళా నిరసనకారులతో పురుష పోలీసులు మర్యాద లేకుండా ప్రవ ర్తించారని ఆరోపించారు. తనవద్ద పనిచేసే ఒక మహిళా జూనియర్ న్యాయవాదిని పోలీ సులు వ్యాన్‌లో తీసుకెళ్లి 11 కి.మీ. దూరంలో నిర్మానుష్య ప్రాంతంలో వదిలేశారని మాజీ అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ధర్మాసనానికి వివరించారు. పేశనివారం నాటి వాతావరణం చూస్తే దేశంలో పోలీసు రాజ్యం ఏర్పడటానికి ఒక్క అడుగు దూరం లోనే ఉన్నామనే భావన కలిగిందని సీనియర్ న్యాయవాది షాదన్ ఫరసాత్ వ్యాఖ్యా నించారు.

# బీజేపీ రావణుడైతే.. కాంగ్రెస్ రాముడు

(మొదటి పేజీ తరువాయి)

పరాయివారిగా మారిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గోవా భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్ అని ప్రజలు చెప్పుకుంటున్నారన్నారు. ప్రమోద్ సావంత్ గోవాను అభివృద్ధి చేయకుండా ప్రజల ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారని ఆరోపించారు. గోవాలో నిరుద్యోగిత తీవ్రంగా ఉందన్నారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక నిరుద్యోగ యువకులు కొందరు డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో గోవా.. ఒక డ్రగ్స్ స్టోర్‌గా మారిందన్నారు. 2023కు ముందు హైదరాబాద్ కూడా డ్రగ్స్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్‌లో కొంత భాగం గోవా నుంచి వస్తున్నట్లు గుర్తించి, ప్రత్యేక బృందాన్ని పంపగా పెద్ద ఎత్తున స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ క్రమంలో పలువురు నైజీరియన్లనూ అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నషా ముక్త్ భారత్ అని మాట్లాడుతున్న ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. ఆ పనిని గోవాలో ఎందుకు అమలు చేయట్లేదని నిలదీశారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌కు పోలీసులతో పాటు ఈడీ, సీబీఐ, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థల మద్దతు ఉన్నప్పటికీ డ్రగ్స్ సమస్యను ఎందుకు నియంత్రించలేకపోతున్నారని నిలదీశారు. '' గోవాను డ్రగ్స్ పెడ్లర్స్ అడ్డాగా మార్చారు. ఇది గోవాకు కీర్తిని తెచ్చి పెడుతుందా.. లేక పేరు చెడగొడుతుందా?'' అని ప్రశ్నించారు. గోవా యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దు.. గోవా పేరు చెడిపోవద్దన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు. గోవాలో కాంగ్రెస్ పార్టీకి కాకుండా ఏ పార్టీకి ఓటు వేసినా అది బీజేపీకే చేరుతుందన్నారు. గోవాలో డ్రగ్స్ లార్డ్స్.. ల్యాండ్ మాఫియా రాజ్యమేలాలా.? కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలా ? అన్నది ఇక్కడి ప్రజలు ఆలోచన చేయాలన్నారు. గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం... కాంగ్రెస్ పార్టీ కోసం కాదని, ప్రజల కోసం రావాల్సిన అవసరం ఉందన్నారు. గోవా ఎన్నికల్లో ప్రజలు హస్తం గుర్తుకు మాత్రమే ఓటు వేసి గెలిపించాలన్నారు. చిన్నపార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు ఓటు వేస్తే అది బీజేపీకే లాభం చేకూరుస్తుందన్నారు. ప్రతిపక్ష ఓట్లను చీల్చేందుకే చిన్న పార్టీలను బీజేపీ ప్రోత్సహిస్తోందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. బీజేపీకి ఐటీ, సీబీఐ, ఈడీ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థలు ముందుండి పని చేస్తాయని.. ఇప్పుడు వాటితో కూడా ఆ పార్టీకి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అందుకే జ్ఞానేశ్ కుమారు పేరుతో ప్రధాని మోదీ ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీఈసీ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నైరుతీ రుతుపవనాలు ముందుగా కేరళ, ఆ తర్వాత గోవాలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. అలాగే 2026లో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, 2027లో గోవాలో ఏర్పాటు కాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి నేరుగా ఢిల్లీ ఎర్రకోటపై మూడు రంగుల జెండా ఎగరడం ఖాయమన్నారు.

# యాసంగి 'వరి' వద్దే వద్దు

(మొదటి పేజీ తరువాయి)

రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇప్పటికే సాగులో ఉన్న తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యతను అంచనా వేయకుండా రెండో పంట సాగు చేసి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి రాకుండా ప్రభుత్వ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఐటీడీఏ నిధులు రూ.1.63 కోట్లతో మంగలితండా నుంచి దుబ్బతండా వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. జుజ్జుల్‌రావుపేటలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న నీటి నిల్వ ట్యాంకు, పైపులైన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మంగలితండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి వసతులు మెరుగుపడేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం హటియాతండాలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బదావత్ వీరన్న తండ్రి బాషా కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా నిర్వహించిన సభల్లో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు కొరత పరిస్థితులపైనా మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో యూనిట్ విద్యుత్తు రూ.7 నుంచి రూ.8 వరకు లభించేదని, ప్రస్తుతం యూనిట్‌కు రూ.15 చెల్లించేందుకు సిద్ధమైనా అవసరమైన విద్యుత్తు దొరకని పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యుత్తు లభ్యతపై ఏర్పడుతున్న ఒత్తిడి వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. నీటి వనరుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై ఉంటుందని మంత్రి పేర్కొంటూ, తెలంగాణకు అదనపు ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరించనున్నట్లు తెలిపారు. జల సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు, ప్రజలు మరియు రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని కేంద్రాన్ని అభ్యర్థించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచేందుకు జీ రామ్ జీ పథకం కింద అదనపు పనిదినాలు కల్పించాలని కూడా కోరనున్నట్లు తెలిపారు. అయితే ఎల్‌నినో ప్రభావం తీవ్రత, వర్షపాతం పరిస్థితులను బట్టి వ్యవసాయ రంగంపై పడే ప్రభావం మారే అవకాశం ఉన్నందున రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ హాఫీజుద్దీన్, జూకూరి గోపాలరావు, పలువురు సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో తాగునీటి అవసరాలు, సాగునీటి వినియోగం, విద్యుత్తు సరఫరా వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు అవసరమని మంత్రి పేర్కొన్నారు. రైతులు రెండో పంట విషయంలో తొందరపడి నిర్ణయం తీసుకోకుండా నీటి వనరులు, సాగునీటి లభ్యతను పరిశీలించాలని కోరారు.

# జూన్ నాటికి సమీకృత పాఠశాల అందుబాటులోకి రావాలి

ఖమ్మం, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):

వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి పొన్నెకల్ వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదే శించారు. ఆదివారం ఖమ్మం జిల్లా పొన్నెకల్ వద్ద సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మి స్తున్న పాఠశాల భవన సముదాయాన్ని జిల్లా కలెక్టర్ దివాకరతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియతిరుగుతూ వివిధ విభాగాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. సంబంధిత అధికారులు నిర్మాణ వివరాలు, ప్రస్తుత స్థితిగతులను వివరించగా, పనుల వేగం, నాణ్యత, మిగిలిన నిర్మాణాల గురించి మంత్రి ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తిచేసి విద్యార్థులకు పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పాఠశాల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. భవన సముదాయం లోని వివిధ విభాగాల నిర్మాణ పురోగతిని పరిశీలిం చిన ఆయన, పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చే శారు. అయితే, నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తికావాలంటే సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుం డా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిర్మాణానికి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలను నిర్మిస్తోందని మంత్రి తెలిపారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా నాణ్యమైన విద్యకు దూరం కాకుండా ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యా అవకా శాలు కల్పించడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశ మని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన తోపాటు సురక్షితమైన వసతి, అవసరమైన ఇతర సదుపాయాలు కల్పించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడవచ్చని పేర్కొన్నారు. ఆధునిక విద్యా ప్రమాణాలకు అనుగుణంగా పాఠశాలలను అభివృద్ధి చేయడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని అభిప్రాయపడ్డారు. యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలల నిర్మాణం విద్యారంగంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగమని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు వసతి సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులో ఉండేలా నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. పొన్నెకల్ పాఠశాల పనులు పూర్తయితే ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అభ్యసించే అవకాశం మెరుగుపడనుంది. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని మంత్రి సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాల అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పాఠశాల నిర్మాణ పనుల పురోగతిని మంత్రి స్వయంగా పరిశీలించడంతోపాటు అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. జూన్ నాటికి పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆదేశాల నేపథ్యంలో రానున్న నెలల్లో నిర్మాణ పనుల పురోగతి కీలకంగా మారనుంది. అన్ని విభాగాల పనులు పూర్తిచేసి, అవసరమైన సదుపాయాలను సిద్ధం చేసిన తర్వాతే విద్యార్థులకు పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది.



# మునుగోడు తాగు, సాగునీటి విషయంలో రాజీపడేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

పథకానికి, దాని పరిధిలోని మునుగోడు నియోజకవర్గ ప్రాజెక్టులకు నీటిని ఎక్కడి నుంచి తరలించాలనే అంశంపై గతంలో తగిన నిర్ణయాలు తీసుకోలేదని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన చొరవతో ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే ప్రతిపాదనకు ఆమోదం లభించిందని వివరించారు. ఈ పనులకు సంబంధించి రూ.1,800 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో నీటి తరలింపు పనులు, సంబంధిత నిర్మాణాలు ముందుకు సాగితే మునుగోడు ప్రాంత ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించేందుకు మార్గం సుగమమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే పనులతోపాటు లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్ల పరిధిలో చేపట్టాల్సిన ప్రధాన నిర్మాణ పనులపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడం, అవసరమైన అనుమతులు పొందడం, నిర్మాణ పనుల్లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై విశ్రాంత ఇంజనీర్ల అభిప్రాయాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. నీటి తరలింపునకు సంబంధించి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా భూసేకరణ, ప్రధాన నిర్మాణ పనులు, ఇతర అనుబంధ పనులు పూర్తయ్యేలా ప్రభుత్వంతో మాట్లాడతానని విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఫ్లోరైడ్ సమస్యతో మునుగోడు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ తాగునీటి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే అంశంపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలే ప్రధాన ప్రాధాన్యంగా ఉండాలని పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కారంతోపాటు వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడవచ్చన్నారు. ప్రాజెక్టుల అమలులో సాంకేతిక నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ నిర్ణీత లక్ష్యాలను సాధించేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ పథకాలు పూర్తయితే మునుగోడు నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం, సలహాదారులు వి.వెంకటరామారావు, ఎం.సత్తిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, నీటి తరలింపు విధానం, నిర్మాణ పనుల నిర్వహణపై తమ అభిప్రాయాలను వారు వెల్లడించారు. ప్రభుత్వం ప్రకటించిన నిధులు, ప్రతిపాదిత పనులు కార్యరూపం దాల్చి రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయితే మునుగోడు ప్రాంతంలో తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారానికి దోహదపడే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు పనుల పురోగతి, నీటి సరఫరా ప్రారంభం, ఆయకట్టుకు అందే ప్రయోజనాలపై సంబంధిత శాఖల అధికారిక వివరాలు కీలకంగా మారనున్నాయి.



## తమిళనాడు అభివృద్ధికి విజయ్‌తో కలిసి పనిచేస్తా

(మొదటి పేజీ తరువాయి)

వినియోగానికి అందుబాటులోకి తీసుకొచ్చారు. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని మెట్రో మార్గాల విస్తరణ చేపడుతున్నారు. కొత్త మార్గం అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతాల మధ్య ప్రయాణించే ప్రజలకు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయం కలగనుంది. ముఖ్యంగా రహదారులపై వాహనాల రద్దీని తగ్గించేందుకు మెట్రో సేవలు దోహదపడే అవకాశం ఉంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి మెట్రో రైలు సేవలను ప్రారంభించారు. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్త మార్గంలో రైళ్ల రాకపోకలకు అధికారికంగా శ్రీకారం చుట్టడంతో రెండో దశ విస్తరణలో మరో కీలక భాగం ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లయింది. నగర రవాణా వ్యవస్థలో మెట్రో సేవల పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గం ప్రారంభం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త స్టేషన్ల ద్వారా సమీప ప్రాంతాల ప్రజలు మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ప్రారంభోత్సవం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్‌తో కలిసి మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా కొత్త మార్గంలోని రవాణా సదుపాయాలను పరిశీలించారు. మెట్రో రైలు సేవలు ప్రారంభం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంది. అయితే ప్రయాణ సమయంపై ప్రభావం, ప్రయాణికుల రద్దీ, ఇతర రవాణా మార్గాలతో అనుసంధానం వంటి అంశాలు సేవల వినియోగం పెరిగేకొద్దీ మరింత స్పష్టమవుతాయి. మెట్రో సేవలను సురక్షితంగా, సమర్థంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ నగర రవాణా మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా చేపట్టబడుతోంది. ఇందులో నాలుగో మార్గానికి చెందిన తొలి భాగాన్ని ప్రారంభించడం ద్వారా పూవిరుందవల్లి బైపాస్ నుంచి వడపళని వరకు కొత్త ప్రయాణ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 11 ఎత్తైన స్టేషన్లతో కూడిన ఈ మార్గం స్థానిక ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. మెట్రో సేవల విస్తరణతో ప్రజా రవాణా వినియోగం పెరిగి, వ్యక్తిగత వాహనాలపై ఆధారపడటం తగ్గే అవకాశం ఉంది.

## నల్గొండ అభివృద్ధికి రూ.74 కోట్లతో రహదారులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపార కార్యకలాపాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కనగల్ మండలం తెల్లకంటిగూడెం నుంచి తొరగల్లు, జంగమాయిగూడెం మీదుగా ముషంపల్లి వరకు రహదారి విస్తరణ పనులను రూ.41 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. ఈ మార్గం అభివృద్ధి పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, రైతులు తమ పంటలను మార్కెట్లకు తరలించేందుకు, అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు మెరుగైన రహదారి సదుపాయాలు దోహదపడనున్నాయి. రహదారి విస్తరణతో ప్రయాణ సమయం తగ్గడంతోపాటు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్ణీత సమయంలో పూర్తి చేయడం ద్వారా ప్రజలకు త్వరగా ప్రయోజనాలు అందించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగనున్నారు. నల్గొండ–నిడమనూరు రహదారి నుంచి చెట్ల చెన్నారం, చిన్నమాదారం, తంగెళ్లవారిగూడెం మీదుగా ముషంపల్లి వరకు మరో రహదారి విస్తరణ పనులను రూ.33 కోట్లతో చేపట్టనున్నారు. ఈ మార్గం అభివృద్ధి ద్వారా పలు గ్రామాలకు ప్రధాన రహదారులతో అనుసంధానం మెరుగుపడనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు చేరుకోవడం సులభతరం కావడంతో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. వ్యవసాయ ఉత్పత్తులను తరలించే రైతులకు, స్థానికంగా వ్యాపారాలు నిర్వహించే వారికి ఈ రహదారి ఉపయోగకరంగా మారనుంది. రెండు రహదారుల విస్తరణ పనులు పూర్తయితే ముషంపల్లి పరిసర గ్రామాలతోపాటు మార్గమధ్యంలోని ఇతర గ్రామాల ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరనుంది. రహదారుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపార రంగాలకు సంబంధించిన సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు.

## విద్యార్థుల సందేహాల నివృత్తికి కృత్రిమ మేధ

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలు చూపించేందుకు యువ ఆవిష్కర్తలు ముందుకు రావడం ప్రోత్సాహకరమని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచడంతోపాటు వారికి అవసరమైన సమాచారాన్ని సులభంగా అందించడంలో ఇటువంటి నూతన కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అనేక అంశాలను అర్థం చేసుకోవడానికి అదనపు సహాయం అవసరమవుతోంది.

తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాల్లో సందేహాలు వచ్చినప్పుడు వాటిని నివృత్తి చేసుకోవడం, క్లిష్టమైన అంశాల ను మళ్లీ నేర్చుకోవడం, పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావడం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని బ్రిలియన్స్ ఏఐ వంటి కార్యక్రమాలు రూపుదిద్దుకుంటున్నాయి. విద్యార్థు లు తమ అభ్యసన వేగానికి అనుగుణంగా పాఠాలను నేర్చుకు నే అవకాశం కల్పించడం వీటి ప్రత్యేకతగా భావిస్తున్నారు. సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన అభ్యసన వనరులు అందుబాటులో ఉంటే విద్యార్థులు తమ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమాజంలోని వాస్తవ సమస్యలకు పరిష్కారాలు చూపిస్తున్న యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

https://epaper.vaarthavedikasurya.com
PRGI NO: TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY





## యాదాద్రి భువనగిరి

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



**మోత్కూరు, అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):**

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరం లాంటిదని దత్తప్పగూడెం సర్పంచ్ గుండు యాదగిరి అన్నారు. ఆ గ్రామానికి చెందిన కంబాల లింగయ్య ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని చికిత్స పొందారు. నిరుపేద కుటుంబానికి చెందిన లింగయ్య ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద దరఖాస్తు చేసుకోగా ఆయనకు రూ 19000 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంజూరైంది. ఈ మంజూరైన చెక్కును ఆదివారం లింగయ్య నివాసంలో ఆయనకు సర్పంచ్ అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇటికాల ఎల్లమ్మ, మాజీ ఎంపిటిసి ఆకవరం లక్ష్మణాచారి, వార్డు సభ్యులు వంగూరి శ్రీకాంత్, బోనగిరి సంతోష్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్ కే సాజిత్ పాషా, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తెప్పల రాయప్ప, స్థానిక నాయకులు నారమళ్ళ రవి,ఎలుగు సతీష్,జి శ్రీను,ఎలుగు యాదయ్య, సోమయ్య,యాదగిరి, సత్తయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

## హైదరాబాద్ లోనే కాలనీ ఏర్పాటు చేయాలి

**రాంపాక నాగయ్య మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**మోత్కూరు, అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):**

కాంగ్రెస్ పార్టీ హాయంలోనే తెలంగాణ ఉద్యమకారులను అణిచి వేతలకు కుట్రలు కుతంత్రాలు చేసి అనేకమంది ఉద్యమకారులను తమ పొట్టన పెట్టుకున్నారని సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య ఆరోపించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం మరితప్పించిన తెలంగాణ ఉద్యమకారులు 1952 లో ఐదుగురు 69లో 369 మంది 2009 మలిదశ తెలంగాణ ఉద్యమంలో 1200 మంది విద్యార్థులకు ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం కోసం మరి తపించి అమర వీరులకు హైదరాబాద్ నడి బొడ్డున కాకుండా గజ్వేల్ అడవుల ప్రాంతాలలో అమరులకు కాలనినీ ముఖ్యమంత్రి ఏర్పాటు చేస్తామనడం ఇది అమరవీరుల కుటుంబాలను అవమానపరచడమేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా అమరుల త్యాగాలను స్మరించుకునే ముందు. హైదరాబాద్ లోని నడిబొడ్డునే నివాస స్థలాలు కేటాయించి అమరుల కాలనీ ఏర్పాటు చేయాలని, నాగయ్య డిమాండ్ చేశారు.లేనియెడల తామే అమరుల కుటుంబాలతో కలిసి హైదరాబాద్ లో కాలనీ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్ , రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షులు కొండ సోంమల్లు, బీసీ సెల్ మండల అధ్యక్షులు పానుగుల్ల విష్ణుమూర్తి, మండల నాయకులు నేర్లకంటి మత్స్య గిరి, సోషల్ మీడియా మండల కన్వీనర్ పొన్నె బోయిన మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

**అమ్మవారి అనుగ్రహం కోసం పవిత్ర నియమాలు పాటించాలి**

**యాదాద్రి జిల్లా రైతు బంధు డైరెక్టర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కోరే లక్ష్మీ భిక్షపతి దంపతుల వెల్లడి**



**ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంలో శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ పవిత్ర వేడుకల సందర్భంగా యాదాద్రి జిల్లా రైతు బంధు డైరెక్టర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు, కురుమ సంఘం రాష్ట్ర నాయకులు కోరే లక్ష్మీ భిక్షపతి దంపతులు మాట్లాడారు. జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని వారు కోరారు.నవరాత్రుల కాలంలో అమ్మవారి కృపకు పాత్రులు కావడానికి భక్తులు పాటించాల్సిన ఆధ్యాత్మిక నియమాలను కోరే లక్ష్మీ భిక్షపతి దంపతులు ఈ క్రింది విధంగా వివరించారు.మనోవాక్కాయ పవిత్రత నవరాత్రుల కాలంలో కేవలం బాహ్య శుద్ధే కాకుండా మానసిక పవిత్రతను కాపాడుకోవాలి. దైవ చింతనతో, భక్తిభావంతో గడపాలి.నిష్టతో ఉపవాస దీక్షలు శక్తి మేరకు భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించాలి. సాత్విక ఆహారాన్ని మాత్రమే తీసు కుంటూ అమ్మవారి ధ్యానంలో ఉండాలి.నిత్య పూజలు – కుంకుమార్చనలు ప్రతిరోజూ ఉదయమే స్నానాది కర్మలు పూర్తి చేసుకుని అమ్మవారికి దీపారాధన, విశేష కుంకుమార్చనలు నిర్వహించాలి.సమైక్యత – ఐక్యత ఆలయ ప్రాంగణాల్లో క్రమశిక్షణ పాటిస్తూ, తోటి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలి.నవరాత్రి ఉత్సవాల పవిత్ర సమయంలో భక్తులందరూ ఈ నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ శ్రీ దుర్గామాత దివ్య ఆశీస్సులు పొందాలని కోరే లక్ష్మీ భిక్షపతి దంపతులు ఆకాంక్షించారు. ఈ పూజల ఫలితంగా మండల ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో తులతూగాలని వారు కోరుకున్నారు.

# పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పై కాంగ్రెస్ పార్టీ గురి

- 2007 నుంచి వరుసగా నాలుగుసార్లు గెలుపొందిన బిఆర్ఎస్..
- 2024 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కు దక్కిన విజయం.
- ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే మాజీమంత్రి దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డి పేరును కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.
- ఇంకా అభ్యర్థుల వేటలోనే బిఆర్ఎస్ బిజెపి పార్టీలు ప్రభుత్వ పథకాలను యువతకు వివరించడంలో కాంగ్రెస్ పార్టీ ఉండగా ప్రభుత్వ వైఫల్యాలను యువతకు వివరించి గెలుపు లక్ష్యంగా దూసుకుపోయే వ్యూహ రచనలో బిఆర్ఎస్ బిజెపి




**మోత్కూరు, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక రాజకీయ వేడిని ఇంకా నోటిఫికేషన్ రాకముందే అన్ని పార్టీలలో అగ్గిరాజేస్తుంది.2024 నాటి ఉప ఎన్నికల్లో విజయంలో వచ్చిన ఊపును కొనసాగించి అధికార పార్టీ ఎన్నికల నోటిఫికేషన్ ముందే తమ అభ్యర్థిని అయిటువంటి దివంగత మాజీ మంత్రి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డిని ప్రకటించి ఈ ఎమ్మెల్సీ ల పోరుకు మేము సైతం అంటూ రెడీ గానే అయ్యింది. మరోవైపు 2007 నుంచి వరుసగా నాలుగు సార్లు ఈ స్థానాన్ని దక్కించుకున్న బిఆర్ఎస్ తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు తనదైన శైలిలో వ్యూహాలు రచిస్తోంది. ప్రతి ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఓటమితో సరిపెట్టుకుంటున్న బిజెపి ఈసారి బలమైన గట్టి అభ్యర్థిని రంగంలో దించి పోటీకి త్రిముఖంగా మార్చాలని ఆలోచిస్తోంది. అభ్యర్థుల ఎంపిక, పట్టుబద్రుల ఓటరు నమోదు క్షేత్రస్థాయిలో ప్రచారంలో ఇప్పటికే రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. గతంలో రద్దయిన శాసనమండలిని 2007 అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ క్రమంలో నల్లగొండ కేంద్రంగా వరంగల్ నల్లగొండ ఖమ్మం ఉమ్మడి జిల్లాలతో పట్టుబద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో తొలిసారిగా 2007లో జరిగిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ పక్షాన కపిల్ బాయ్ దిలీప్ కుమార్ విజయం సాధించారు.రెండోసారి ఎన్నికల్లో కూడా దిలీప్ కుమార్ విజయం సాధించారు. ఆ తదుపరి రెండు ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. 2007 నుంచి 2021 వరకు నాలుగు సార్లు జరిగిన ఎన్నికల్లో గులాబీ పార్టీ విజయంగా దూసుకెళ్లింది. 2007 9 కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా టిఆర్ఎస్ విజయం సాధించింది. ఒకవైపు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉండటంతో పాటు ఆ సమయంలో పట్టుభద్రులు కూడా గులాబీ పార్టీకి జై కొట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పళ్ళ రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. దీంతో ఆ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయావల్సి వచ్చింది. 2024 లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల పోరులో ఈ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న కు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీగా విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ పట్టుబద్రులలో తొలిసారిగా పాగావేసింది. 2007 నుంచి 24 వరకు 5 ఎన్నికల్లో నాలుగు సార్లు బిఆర్ఎస్ ఒక్కసారి కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక నోటిఫికేషన్ విడుదల చేసే వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించే వరకు తెలియని పరిస్థితిలో ఉండే ... ఈసారి మాత్రం నోటిఫికేషన్ ముందే అభ్యర్థిని ఖరారు చేయడంతో రాష్ట్ర రాజకీయాలను ఒక హార్ట్ టాపిక్ గా మారింది. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ టికెట్ ఆశించిన వారిలో డజన్ మందిగా ఉండే.. ఈసారి ముందుగా అభ్యర్థిని ప్రకటించే ఓటరు నమోదుkun అభ్యర్థి దృష్టి సారించే అవకాశం ఉంటుందని పార్టీ అధిష్టానం భావించి టికెట్ ఖరారు చేసి ఉంటుందని పలువురు ఆ పార్టీ జిల్లా నాయకులు అభిప్రాయ పడ్డారు. అభ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ బిజెపి పార్టీలు. అభ్యర్థుల ఎంపికపై బి ఆర్ ఎస్ బిజెపి పార్టీలు బలమైన అభ్యర్థుల కోసం కసరత్తు చేస్తున్నాయి. ఈ పట్టు బద్దుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఆయా పార్టీలు ముమ్మరంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలలో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించడంతో బిఆర్ఎస్ కూడా గత ఎన్నికల్లో పోటీ చేసిన రాకేష్ రెడ్డిని మళ్లీ నిలబెట్టి దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అదే దిశగా బిజెపి పార్టీ కూడా త్వరగా ప్రకటించే విధంగా తీవ్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మూడు జిల్లాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో పార్టీకి బలమైన అభ్యర్థిని వెతికే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ పట్టుభద్రుల ఎన్నికలను అధికార పార్టీతో పాటు బిఆర్.ఎస్,బిజెపి పార ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలుపే లక్ష్యంగా దూసుకెళ్ళాడానికి అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయి. రానున్న 4,5 నెలలలో జరగనున్న ఈ ఎన్నికలల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుందో వేచి చూడాల్సిందే.

## బతుకమ్మ వేడుకల్లో కులవివక్ష ఆరోపణలు

- ఎస్సీ మహిళా సర్పంచ్, వార్డు సభ్యురాలిని కులం పేరుతో అవమానించారని కెవిపిఎస్ ఆగ్రహం
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి: కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బలింగం, కార్యదర్శి అన్నపుట్ల కృష్ణ



**భువనగిరి టౌన్, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య)**

మూటకొండూరు మండలం అమ్మన బోలు గ్రామంలో బతుకమ్మ వేడుకల సందర్భంగా కులవివక్ష చోటుచేసుకుందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షుడు దుబ్బలింగం, కార్యదర్శి అన్నపుట్ల కృష్ణ ఆరోపించారు. గ్రామ సర్పంచ్ మామిడాల నర్సమ్మ, వార్డు సభ్యురాలు బొజ్జ శ్రీలతలను కులం పేరుతో అవమానించి, బతుకమ్మ ఆడకుండా అడ్డుకున్నారని వారు పేర్కొన్నారు. శనివారం రాత్రి గ్రామపంచాయతీ వద్ద మహిళలు బతుకమ్మ ఆడుతున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు కెవిపిఎస్ నాయకులు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్, వార్డు సభ్యురాలు ఇతర మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతుండగా, కొందరు బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళలు కులం పేరుతో దూషించి అవమానించినట్లు ఆరోపించారు. సాధారణంగా రాత్రి 11 గంటల సమయంలో నిమజ్జనం చేసే బతుకమ్మలను, ఈ వివక్ష కారణంగా సాయంత్రం 7 గంటలకే నిమజ్జనం చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులైన ఎస్సీ మహిళలకే కులవివక్ష ఎదురవడం ఆందోళనకరమని కెవిపిఎస్ నాయకులు అన్నారు. దేశంలో కులవివక్ష, అంటరానితనం కొనసాగడం సమాజ అభివృద్ధికి ఆటంకమని పేర్కొంటూ, రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని వారు కోరారు. అధికారులు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గ్యారా అశోక్, జిల్లా కమిటీ సభ్యుడు కోట కిష్టయ్య పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

- బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు.. వేదమంత్రాల నడుమ ప్రతిష్ఠాపన కార్యక్రమం



**భువనగిరి టౌన్, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

భువనగిరి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో వీర సావర్కర్ దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 11:30 గంటలకు అమ్మవారిని బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో అలంకరించి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రాల నడుమ అష్టదిక్పాలకుల పూజలు, నవగ్రహ మండప ఆరాధన తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీంతో హైదరాబాద్ చౌరస్తా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు రత్నాపురం శ్రీశైలం, బెండ శ్రీకాంత్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా హైదరాబాద్ చౌరస్తాలో వీర సావర్కర్ దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భువనగిరి పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారి సన్నిధిలో హోమాలు, కుంకుమార్చనలు, గోపూజలు, అన్నదాన కార్యక్రమాలతో పాటు బతుకమ్మ సంబరాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ముఖ్య అతిథిగా భువనగిరి మున్సి పల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ హాజరయ్యారు. స్థానిక కౌన్సిలర్ బెండ లాల్రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాయ దశరథ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నాపురం బలరాం, కాలేరు లక్ష్మణరావు, వీరపాక నరసింహా, కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## బాధిత కుటుంబానికి 'బీర్లా ఫౌండేషన్' ఆసరా

**మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత**

**మానవత్వాన్ని చాటుకున్న బీర్లా అనిత**

**మోటకొండూరు, అక్టోబర్ 11 (వార్త వేధిక సూర్య ):**



మోటకొండూరు మండలం నాంచారిపేట గ్రామానికి చెందిన బచ్చమల్లేయ్య ఇటీవల మరణించారు. పెద్ద దిక్కును కోల్పోయి ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ 'బీర్లా ఫౌండేషన్' ఆసరాగా నిలిచింది. ఫౌండేషన్ తరపున బీర్లా అనిత బాధిత కుటుంబ సభ్యులకు, ఆయన మనుమలకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. సాటి మనిషి కష్టంలో ఉన్నప్పుడు ఆదుకోవడమే నిజమైన మానవత్వమని, నిరుపేదలకు బీర్లా ఫౌండేషన్ ద్వారా బీర్లా అనిత చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని స్థానిక నాయకులు కొనియాడారు. బాధిత కుటుంబానికి ఈ సహాయం కొంత ఊరటనిస్తుందని వారు పేర్కొన్నారు. గ్రామశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ పైళ్ల మహేష్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గంధమల్ల నరసయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లూరు సత్యనారాయణ గౌడ్,సీనియర్ నాయకులు పైళ్ల సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ శర్మ, మూసుకు బాల్ రెడ్డి, పైళ్ల దర్శన్ రెడ్డి, బచ్చే వెంకటేష్, కప్ప శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా పండుగ సంబరాలు

**గంగా జమునా తెహజీబ్‌కు ప్రతీకగా భువనగిరి..**

**ఐకమత్యంతో బతుకమ్మ వేడుకలు**



**భువనగిరి టౌన్, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భువనగిరి పట్టణంలోని 31వ వార్డులో మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 31వ వార్డు మహిళా కౌన్సిలర్ సుమయ్య తబస్సుం షఫీఖ్ అహ్మద్ మహిళలతో కలిసి పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ తెలంగాణలో గంగా జమునా తెహజీబ్ సంప్రదాయం ఆనాటి నుంచి కొనసాగుతోందని తెలిపారు. భువనగిరి పట్టణంలోని 31వ వార్డులో కులమతాలకు అతీతంగా ప్రతి పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయనిఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు స్థానికులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి: 2
సంచిక: 144
సోమవారం
12 అక్టోబర్, 2026

# కృష్ణారెడ్డి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

## ఎమ్మెల్యే సామేల్



**మోత్కూరు, అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):**

నేటి యువత కొప్పుల కృష్ణారెడ్డి స్ఫూర్తితో యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. ఆదివారం మోత్కూరు మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామానికి ఖతార్ దేశానికి రాయబారిగా వ్యవహరిస్తున్న కొప్పుల శ్రీకర్ రెడ్డి తండ్రి మాజీ ఆర్మీ అధికారి దివంగత కొప్పుల కృష్ణారెడ్డి విగ్రహాన్ని ఆ గ్రామంలో ప్రాథమికోన్నత వద్ద ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు కుటుంబంలో జన్మించిన కృష్ణారెడ్డి చిన్నతనం నుంచే విద్యాభ్యాసం పట్టుదలతో ముందుకు సాగడంతో 20 ఏళ్ల వయస్సులో ఆర్మీలో ఉద్యోగం పొంది 1965 చైనాతో భారతదేశం యుద్ధం జరుగుతున్న సమయంలో అప్పటి ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి పిలుపులో భాగంగా పంజాబ్ కాశ్మీర్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో 18 సంవత్సరాల పాటు సమర్ధవంతంగా పని చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఆర్మీలో రిటర్మెంట్ అయినప్పటికీ ఎస్ బిఐ.బ్యాంక్ లో హెడ్ క్యాషియర్ గా 21 ఏళ్ల పాటు రాష్ట్రంలో పలుచోట్ల పనిచేయడంతో పాటు తమ కుమారుడైన శ్రీకర్ రెడ్డిని ఉన్నత విద్యకు ప్రోత్సహించారని,నేడు ఆ శ్రీకర్ రెడ్డి ఖాతార్ దేశంలో భారత దేశ రాయబారిగా పనిచేస్తున్నారంటే 140 కోట్ల భారత దేశ ప్రజలకు శుభ పరిణామమని పేర్కొన్నారు.కృష్ణారెడ్డి గత ఏడాది మరణించేంత వరకు గ్రామ అభివృద్ధికి తోడ్పాటు చేశారని.. ఈ క్రమంలోనే 2012_13 సంవత్సరంలో గ్రామంలో సిసి రోడ్డులు, వివిధ మౌళిక సదుపాయాల కల్పనకు అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో కృషి చేయడం హర్షించదగ్గ విషయన్నారు. గ్రామంలో కలుపుకుపోయే కృష్ణారెడ్డి గ్రామ యువతను విద్యాభ్యాసం క్రీడలలో వెన్నంటి ఉండి ప్రోత్సహించారన్నారు. కొండగడప గ్రామానికి చెక్ డ్యామ్ మంజూరు అయ్యిందని, ఈ చెక్ డ్యామ్ తో రైతాంగానికి సాగునీరు సమస్య తీరుతుందని తెలిపారు. చెరువు ప్రక్కన దేవాలయం కట్టడం వల్ల అక్కడి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని,ఆ ప్రాంతంలో స్థానిక కౌన్సిలర్లు కలిసికట్టుగా కల్వర్టు నిర్మిస్తే అక్కడ సమస్యను తన సొంత నిధులతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చేస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. కృష్ణారెడ్డి దేశానికి, స్వగ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని సామేల్ పిలుపునిచ్చారు. అనంతరం భారత రాయబారి కొప్పుల కృష్ణారెడ్డి కుమారుడైన శ్రీకర్ రెడ్డి మాట్లాడుతూ తన చిన్నతనం నుంచే విద్యాభ్యాసంలో తన తండ్రి కృష్ణారెడ్డి ఎన్ని కష్టాలు ఏర్పడిన వెన్నంటే ఉండి ప్రోత్సహించారని తెలిపారు. గ్రామంలో కృష్ణారెడ్డి లైబ్రరీ, హెల్త్ సెంటర్, సిసి రోడ్లు పాఠశాలలో టీచర్ల నియామకం వంటి సమస్యలను ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు ,ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేశారని తెలిపారు.తండ్రి అడుగుజాడల్లో తాను కూడా రాష్ట్రంలోగాని దేశ,విదేశాలలో ఎక్కడ ఉన్న నాన్నస్ఫూర్తితో గ్రామ అభివృద్ధికి నిరంతరం తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు సుల్తాన్ స్వామి, కొండ శోభ సోంమల్లు, పిఎసిఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ గుర్రం లక్ష్మి నర్సింహ్మా రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, బాలేంల విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్, బద్దం నాగార్జున రెడ్డి, స్థానికులు అంబటి విజయ్ కుమార్, గొడిశాల వెంకన్న, బద్దుల చిట్టిబాబు,కొండ సోంమల్లు, కన్నెబోయిన లింగం, తాటిపాముల రాము, నోముల రమేష్ నేత,లెంకల వేణు,అంబటి లక్ష్మయ్య, బందెలరవి, శేఖరా చారి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్లో చేరిన ఓబిసి నాయకుడు



**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల ఓబిసి ప్రధాన కార్యదర్శి దొనగిరి వేణు కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి ఆనాటి నుంచి పార్టీని పట్టుకొని ఉండి కష్టం అనక సుఖమనక జండా మోసే సీనియర్ కాంగ్రెస్ నాయకులకు అన్యాయమే జరిగిందని పార్టీ సీనియర్లను పక్కనపెట్టి 12 పార్టీలు మార్చిన వారిని అందలమెక్కించారని అన్నారు ఎమ్మెల్యే చుట్టూ ఒక నాలుగురు కోటరీ గా చేరి పార్టీ సీనియర్ నాయకుల కు అన్యాయం చేశారు అనీ అన్నారు. ఈ కార్యక్రమం లో మండల టిఆర్ఎస్ అధ్యక్షులు జనగాం పాండు గ్రామ శాఖ అధ్యక్షులు బొట్టు మల్లేశం మాజీ సర్పంచ్ చిందం మల్లిఖార్జున pacs మాజీ డైరెక్టర్ గుమ్మడి సురేందర్ రెడ్డి తెరాస యూత్ వైస్ ప్రసిడెంట్ పోల ప్రవీణ్ గౌడ్ సింగిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లా నాయకులు వల్లపు విజయ్ వార్డు సభ్యులు దండెబోయిన బాలరాజు సామల చంద్రమోహన్ కందాడి సంతోష్ రెడ్డి కొండం శివ చింతల నర్సిరెడ్డి పల్లెపాటి నరసింహ బొట్టు శేఖర్ కొంగల సాయి రేపాక నరేష్ మచ్చ శివ సాయి మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పైల శేఖర్ రెడ్డి కి ఆహ్వాన పత్రిక అందజేత



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 11 ( వార్తా వేదిక సూర్య )**

పట్టణ కేంద్రంలోని కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణ నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కరపత్రాలను భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి కి బిఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేష్ గౌడ్ అందజేశారు. ఈనెల 12 నుండి 16 వరకు జరిగే విగ్రహ ప్రతిష్ట కల్యాణ మహోత్సవ కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు. మాజి వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి , నాయకులు చింతకింది కిరణ్ , రాచకొండ సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి విగ్రహం పునర్నిర్మాణం



**బీబీనగర్ అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య)**

యాదాద్రి భువనగిరి జిల్లా బిబినగర్ మండల్ కొండమడుగు గ్రామంలో గత కొన్నిసంవత్సరాల క్రితం భూమిలోనే ఉండిపోయిన ఆంజనేయస్వామి విగ్రహం గ్రామంలో సంవత్సరం క్రితం భూమి లోనే దర్శనం ఇచ్చిన ఆంజనేయ స్వామి విగ్రహం అది గుర్తించిన పెద్దలు ఈరోజు ప్రత్యేక పూజలు నిర్వహించినారు ఈరోజు హనుమాన్ టెంపుల్ పునర్నిర్మాణంలో భాగంగా పంతులు ఆంజనేయులు శర్మ గారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అభిషేకాలు హోమం జరిపించి దేవస్థాన కమిటీ చైర్మన్ గాండ్ల బాలరాజ్ ఆధ్వర్యంలో పూజలు హోమం జరిపించి గ్రామ ప్రజలు అక్కడికి చేరుకొని ఆంజనేయస్వామిని కొలవడం ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడం పాండురంగం ఉప సర్పంచ్ అరిగే శ్రీధర్ మాజీ జెడ్పిటిసి భాష బోయిన పెంటయ్య మాజీ దేవస్థానం కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి బండమీది జంగయ్య జల్లి అంజయ్య వార్డ్ మెంబర్ భాస్కర్ శ్రీకాంత్ జగదీష్ గౌడ్ బాలయ్య అంజయ్య శ్రీరాములు గౌడ్ మట్టలింగం పెంటయ్య ముదిరాజ్ శివయ్య కడెం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఫ్లోరైడ్ బాధితులకు తీపి కబురు!

- మునుగోడు సస్యశ్యామలమే ధ్యేయం.. వేగంగా హెడ్ వర్క్స్, భూసేకరణ పనులు
- ఏదుల నీటి తరలింపుపై ఎవరెన్ని మాట్లాడినా వెనకడుగు వేసేది లేదు: రాజ్‌గోపాల్ రెడ్డి
- డిండి ఎత్తిపోతల, ఏదుల రిజర్వాయర్ పనులపై తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్లతో కీలక సమీక్ష



**మునుగోడు , అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ రక్కసితో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న మునుగోడు నియోజకవర్గ ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చే విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తే లేదని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధుల బృందంతో ఆయన అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన డిండి ఎత్తిపోతల పథకం, దాని కొనసాగింపు ప్రాజెక్టులైన లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీటిని తరలించే అంశంపై ఈ భేటీలో కూలంకషంగా చర్చించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా డిండి ఎత్తిపోతల పథకానికి, దానికి కొనసాగింపుగా ఉన్న మునుగోడు నియోజకవర్గంలోని లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీటిని ఎక్కడి నుంచి తరలించాలనే దానిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. కానీ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని, ఏదుల రిజర్వాయర్ నుంచే నీటిని తరలించాలని పట్టుబట్టి నిర్ణయం తీసుకునేలా చేశారు. ఇందుకు సంబంధించిన పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 1,800 కోట్లను కూడా మంజూరు చేసిందని ఆయన గుర్తుచేశారు.ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే పనులు, అలాగే మునుగోడు నియోజకవర్గంలోని లక్ష్మణాపురం, శివన్నగూడెం ప్రాజెక్టుల కింద ఉన్న హెడ్ వర్క్స్ పనులను వేగవంతం చేసే అంశంపై సమావేశంలో చర్చించారు. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా భూసేకరణ, హెడ్ వర్క్స్ పనులతో పాటు మిగతా అన్ని ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసేలా ప్రభుత్వంతో మాట్లాడతానని రిటైర్డ్ ఇంజనీర్లకు రాజ్‌గోపాల్ రెడ్డి భరోసానిచ్చారు. ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపుపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో.. మునుగోడు ప్రజల తాగు, సాగునీటి హక్కుల సాధన విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం, సలహాదారులు వి. వెంకటరామారావు, ఎం. సత్తిరెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబరమంటిన బతుకమ్మ సంబరాలు



**నాంపల్లి, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

నల్గొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చండూరు మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు మరియు గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన గౌరీదేవికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా బతుకమ్మ వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, తెలంగాణ ఆడపడుచులు తమ పుట్టింటిలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, బంధుబాంధవ్యాలను గుర్తుచేసుకుంటూ ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు పూలతో గౌరీదేవిని పూజిస్తారని, మహాలయ అమావాస్య రోజు ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై చివరి రోజు సద్దుల బతుకమ్మతో ఈ వేడుకలు ముగుస్తాయని వివరించారు. ఈ వేడుకల్లో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు సాంప్రదాయ వస్త్రధారణలో, పూలతో అందంగా ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగు రంగుల బతుకమ్మల చుట్టూ తిరుగుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ, ఉత్సాహంగా నృత్యాలు చేశారు. బతుకమ్మ పండుగ పర్యావరణాన్ని ఆదరించే ఆచారానికి నిదర్శనమని, అలాగే చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన విజయదశమి సందేశాన్ని ఈ వేడుకలు చక్కగా చాటాయని వక్తలు తెలిపారు. గౌరీ మాత వేషధారణలో విచ్చేసిన చిన్నారులు ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్లు కర్నాటి నాగరాజు, సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్స్ సామల వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సుఖ సంతోషాలతో ఉండాలి...

### శ్రీ ఆధ్య హాస్పిటల్ ఎండి. దేశిడి.రాజుగౌడ్



మునుగోడు అక్టోబర్11.వార్త వేదిక సూర్య,:. శ్రీ దుర్గా మాత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన సతీమణి రమ్యతో కలిసి శ్రీ ఆధ్య హాస్పిటల్ ఎండి. దేశిడి.రాజుగౌడ్ మునుగోడు మండలం గూడపూర్ గ్రామంలో దుర్గామాత వద్ద ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

# యాదాద్రి భువనగిరి



## కమిషనర్‌ను వెంటనే తొలగించాలి

- 13 కోట్ల ఓట్ల తొలగింపు దుర్మార్గం
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ అక్రమ అరెస్టుపై ఖండన
- మోటకొండూరులో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన



**మోటకొండూర్/వార్త వేధిక సూర్య :**

దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లను అక్రమంగా తొలగించిన కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని సీపీఎం డిమాండ్ చేసింది. అలాగే, ఢిల్లీలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీతో పాటు ఇతర జాతీయ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ చర్యలకు నిరసనగా సీపీఎం మోటకొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రజలను పెద్ద ఎత్తున ఓటు హక్కుకు దూరం చేసేందుకు ఉద్దేశించిన ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కోరుతూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. వర్చువల్ కర్ఫ్యూ విధించడం, మెట్రో స్టేషన్లను మూసివేసి రవాణాను నిలిపివేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, పేదల హక్కుల కోసం పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం తగదని, వారిని వెంటనే విడుదల చేసి, బాధ్యుడైన కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు సిహెచ్. రోమన్, బందెల పోచయ్య, గోసంగి పరమేశ్వర్, చెరుకు అనిల్, దూడల శ్రీనివాస్, వడ్డేబోయిన అచ్చయ్య, వంగపల్లి సాయిలు, మైసయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ దసరా సంబరాలు

### ప్రకృతికి మనిషికి ఉన్న బంధం బతుకమ్మ పండుగ

### కరస్పాండెంట్ జిట్టా ధనాపరెడ్డి




**(యాదాద్రి భువనగిరి బ్యూరో) అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**

స్థానిక సాధన హైస్కూల్‌లో బతకమ్మ, దసరాసంబరాలు అంబరాన్ని అంటాయి. ఎస్ఏ–1 పరీక్షలు ముగిసిన అనంతరం యాజమాన్యం ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల మధ్య సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు లంగా, ఓణీలు ధరించి అందంగా ముస్తాబయ్యారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. కరస్పాండెంట్ జిట్టా ధనాప రెడ్డి మాట్లాడుతూ పూలతో దేవతామూర్తులను పూజిస్తాము కానీ ఈ పండుగలో పూలనే శక్తి స్వరూపిణిగా పూజిస్తామన్నారు. ప్రపంచంలోనే పూలను పూజించే పండగ ఏది లేదని కేవలం బతకమ్మకే దక్కిందన్నారు. ప్రకృతికి మనిషికి మధ్య ఉన్న అనుబంధం బతుకమ్మ పండుగ అని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ పండగతో మహిళలకు ఎనలేని బంధం ఉందని ముఖ్యంగా తెలంగాణలో బతుకమ్మ పండుగ వస్తుందంటే ప్రతి ఇంటి మహిళల్లో, యువతుల్లో సందడి ఏర్పడి తొమ్మిది రోజులపాటు ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటారన్నారు. బతుకమ్మ పండుగ వెనుక ఉన్న కథలు, పండుగ ప్రాముఖ్యత, గురించి వివరించారు. అనంతరం దసరా సంబరాలు కూడా జరుపుకున్నారు ఈ వేడుకల్లో జిట్ట సంగీత ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కన్వీనర్‌గా కూనూరి సుధాకర్ గౌడ్ నియామకం

**రామన్నపేట అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య.: )**



భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం (లేబర్ సెల్) రామన్నపేట మండల కన్వీన ర్‌గా శ్రీ కూనూరి సుధాకర్ గౌడ్ నియమితులయ్యారు. నల్గొండ జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు ఇతరాజు సిద్ధు ఆధ్వర్యంలో, పార్టీ సీనియర్ నాయకుల సమీక్ష అనంతరం ఈ నియామకం చేపట్టినట్లు ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, సమాజ సేవ పట్ల అంకితభావాన్ని గుర్తించి సుధాకర్ గౌడ్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు నియామక ఉత్తర్వులో పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్మికుల సంక్షేమానికి, పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామక ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు ఇతరాజు సిద్ధు తెలిపారు. సుధాకర్ గౌడ్ నియామకాన్ని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పదాధికారులు, కార్యకర్తలు గమనించి ఆయనకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

https://epaper.vaarthavedikasurya.com
PRGI NO: TGTEL/25/A0305
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY





# నల్లగొండ

## ఊరికి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

### ఎస్.ఐ సతీష్ కుమార్

మోత్కూరు, అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):

బతుకమ్మ, దసరా పండుగల పురస్కరించుకొని ప్రజలు స్వగ్రామాలకు,బంధువుల ఇళ్లకు విహారయాత్రలకు వెళ్తుంటారని. ఈ సమయాలల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు దొంగతనాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మోత్కూరు ఎస్.ఐ. కే సతీష్ కుమార్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ప్రధాన ద్వారం,వెనుక ద్వారాలు, కిటికీలు, గేట్లను పూర్తిస్థాయిలో తాళాలు వేసి వెళ్లాలన్నారు. బంగారం,వెండి ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో బహిరంగంగా ఉంచకుండా సురక్షితమైన ప్రదేశంలో భద్రపరుచుకోవాలని సాధ్యమైనంత వరకు బ్యాంకు లాకర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి బంధువులకు తెలియజేయాలని కోరారు. ఇంటి బయట అవసరమైన లైట్లు, ఆటోమేటిక్ లైటింగ్, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని. సీసీటీవీ సక్రమంగా పనిచేస్తున్నదో లేదో ముందుగా తనిఖీ చేసుకోవాలన్నారు. ఇంటి మేడపై పడుకున్నా , కొద్దిసేపు బయటకు వెళ్లినా తలుపులు, గేట్లు పూర్తిస్థాయిలో లాక్ చేయాలని,ఇంట్లో ఎవరూ లేని విషయం బయటకు తెలిసేలా చేసే సూచనలను నివారించుకోవాలన్నారు. తమ వీధి, కాలనీలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు,వాహనాలు కనిపిస్తే వారి వివరాలను గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారిని ఎదుర్కోవడానికి ప్రయత్నించవద్దన్నారు. తాళాలను బయట కనిపించే ప్రదేశాల్లో ,డోర్‌మ్యాట్ కింద ఉంచవద్దని, ఇంటి తాళాలను ఇతరులకు సులభంగా అందుబాటులో ఉంచకుండా చూసుకోవాలని కోరారు. పెంపుడు కుక్కలు ఉన్నా, ఇతర భద్రతా ఏర్పాట్లు ఉన్నా వాటిపై మాత్రమే ఆధారపడకుండా తలుపులు, గేట్లకు తాళాలు వేయకుండా ఉండకూడదని పేర్కొన్నారు. ఊరికి వెళ్లేటప్పుడు, తిరిగి వస్తున్నప్పుడు గానీ.. సోషల్ మీడియాలో వివరాలను బహిరంగంగా పోస్టు చేయవద్దన్నారు. అత్యవసర సమయంలో వెంటనే 112కు, సమీప పోలీస్ స్టేషన్‌కు 8712662510, 8712553732, 8712662812 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఆత్మీయ సన్మానం



మోత్కూరు, అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించి తమ కలం గళం ద్వారా ప్రజలలోకి చైతన్యం తీసుకువచ్చిన కళాకారులకు తగిన గుర్తింపు ఉంటుందని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం బి.ఆర్.ఎస్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులను బి.ఆర్.ఎస్ పార్టీ తరఫున ఘనంగా సన్మానించారు. మోత్కూరుకు చెందిన తెలంగాణ ఉద్యమ గీత రచయితలు అభినయ శ్రీనివాస్,కోదారి శ్రీనివాస్ లను ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్,గొంగిడి సునీత, పైళ్ల శేఖర్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి జిల్లా మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యం

### బిఆర్ఎస్ నుండి 15 మంది బిజెపిలో చేరిక

### బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్



భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 11 ( వార్తా వేదిక సూర్య)

బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. ఆదివారం భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో బిజెపి ముఖ్య కార్యకర్తల నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ సమక్షంలో బిఆర్ఎస్ నాయకులు బండారు లక్ష్మణ్ గౌడ్ తో పాటు15 మంది కార్యకర్తలు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల చొక్కారెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సాహే ష్ , అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ , చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గంజి బసవలింగం, జిల్లా నాయకులు చెరుకు వెంకటేష్, పల్లె కాడి బసవయ్య, కౌన్సిలర్ మంజుల లింగస్వామి, నోముల గణేష్, ఎన్నం శివకుమార్, నాయకులు ఉప్పునూతల నరసింహ, కేసారం కృష్ణారెడ్డి , బద్దం వెంకట్ రెడ్డి, రామిడి యాదిరెడ్డి , గంగాదేవి విజయ్ ,వినయ్ చారి,సుశీల, అలివేలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వేళ ధరల మంటలు

- సామాన్యుడి బడ్జెట్‌కు చిల్లులు!
- బియ్యం నుంచి పప్పులు, కూరగాయల వరకు పెరుగుతున్న ధరలు.. పేద, మధ్య తరగతి కుటుంబాలపై అదనపు భారం
- ఉమ్మడి జిల్లాలోనూ ఇదే పరిస్థితి.. ధరల నియంత్రణకు అధికారుల పర్యవేక్షణ అవసరం

రామన్నపేట, అక్టోబర్ 11 (సూర్య వార్త వేదిక):

పండుగల సీజన్ సమీపిస్తుండటంతో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ఇప్పటికే పెరిగిన ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లులు, పిల్లల చదువుల ఖర్చులతో సతమతమవుతున్న మధ్యతరగతి కుటుంబాలకు వంటింటి సరుకుల ధరల పెరుగుదల మరింత ఆందోళన కలిగిస్తోంది. బియ్యం, చక్కెర, వంట నూనెలు, పప్పు దినుసులతో పాటు ఉల్లిపాయలు, వెల్లుల్లి, అల్లం వంటి వంటింటి అవసరాల ధరలు పెరగడంతో నెలవారీ కుటుంబ బడ్జెట్ తలకిందులవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ నిత్యావసరాల ధరలపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండుగల సమయంలో అదనపు కొనుగోళ్లు చేయాల్సి రావడంతో సాధారణ రోజులతో పోలిస్తే కుటుంబాల ఖర్చులు పెరుగుతున్నాయి. ఆదాయాలు పరిమితంగా ఉన్న కుటుంబాలు మాత్రం అవసరాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

### పక్షం రోజుల్లోనే పెరిగిన ధరలు!

స్థానిక మార్కెట్లు, కిరాణా దుకాణాల్లో లభిస్తున్న ధరలపై అందిన అంచనా వివరాల ప్రకారం.. గత 15 రోజుల ధరలతో పోలిస్తే ప్రస్తుతం పలు నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా ఉన్నాయి.



సన్నబియ్యం కిలో రూ.55 నుంచి రూ.65 మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.65 నుంచి రూ.75 వరకు పలుకుతున్నట్లు అంచనా. చక్కెర ధర కిలో రూ.42–46 నుంచి రూ.50–55కు చేరినట్లు సమాచారం. కందిపప్పు ధర కిలో రూ.140–150 నుంచి రూ.160–175కు, వంట నూనెల ధరలు లీటరుకు రూ.110–130 నుంచి రూ.125–145కు పెరిగినట్లు స్థానిక మార్కెట్ అంచనాలు సూచిస్తున్నాయి. ఉల్లిపాయల ధర కిలో రూ.30–40 నుంచి రూ.50–65కు చేరగా, వెల్లుల్లి ధర రూ.250–300 నుంచి రూ.350–440కు పెరిగినట్లు పేర్కొంటున్నారు. అల్లం, ఎండు మిరపకాయలు, బెల్లం ధరల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది.

### నెలవారీ బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం

నిత్యావసరాల ధరల పెరుగుదల ప్రభావం తక్కువ ఆదాయ కుటుంబాలపై ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వారి నెలవారీ ఆదాయంలో గణనీయమైన భాగం ఆహారం, వంట సరుకులు, రవాణా, విద్యుత్ వంటి తప్పనిసరి అవసరాలకే ఖర్చవుతుంది. ఒక కుటుంబం నెలకు 25 కిలోల బియ్యం కొనుగోలు చేస్తుందని భావిస్తే, కిలోకు రూ.10 పెరుగుదలతో నెలకు అదనంగా రూ.250 భారం పడుతుంది. నాలుగు లీటర్ల వంట నూనెను కొనుగోలు చేసే కుటుంబానికి లీటరుకు రూ.15 పెరుగుదల ఉంటే మరో రూ.60 అదనపు ఖర్చవుతుంది. ఇవి ఉదాహరణకు తీసుకున్న లెక్కలు మాత్రమే. పప్పులు, చక్కెర, కూరగాయలు, మసాలా దినుసుల ధరలు కూడా పెరిగితే కుటుంబానికి నెలాఖరులో మిగిలే మొత్తం మరింత తగ్గుతుంది. ముఖ్యంగా రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, చిరుద్యోగులు, పింఛనుదారులు, చిన్న వ్యాపారుల కుటుంబాలకు ఈ భారం ఎక్కువగా అనిపిస్తుంది. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు పెరగడంతో వైద్యం, విద్య, పొదుపు వంటి ఇతర అవసరాలకు కేటాయించే మొత్తాన్ని తగ్గించుకోవాల్సి వస్తుంది.

## బతుకమ్మలో కుల వివక్షకు తావెక్కడ

- దళిత మహిళలకు జరిగిన అవమానంపై ఎమ్మార్పీఎస్ ఆగ్రహం
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలి
- బాధితులకు న్యాయం చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



ఆలేరు, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య ):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగలో కులం పేరుతో దళిత మహిళలకు అవమానం జరగడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామంలో ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా దళిత మహిళలకు జరిగిన అవమానంపై వారు స్పందించారు. మహిళలను గౌరవించాల్సిన పండుగలో కుల వివక్షకు తావివ్వడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులకు, తెలంగాణ సంస్కృతి స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కులం ఆధారంగ అవమానించడం, వివక్ష చూపడం వ్యక్తుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. బతుకమ్మ పండుగ అందరిదని, ఇందులో పాల్గొనే హక్కు ప్రతి మహిళకు ఉందని స్పష్టం చేశారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

బతుకమ్మ అంటేనే బతుకుకు ప్రతీకగా నిలిచే పండుగ అని, అలాంటి పండుగలో కుల వివక్షకు చోటెక్కడని ప్రశ్నించారు. దళిత మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసు శాఖ సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా జిల్లా కలెక్టర్, పోలీసు యంత్రాంగం చొరవ చూపాలని కోరారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ యువసేన మోటకొండూరు మండల ప్రధాన కార్యదర్శి క్యాసగళ్ల వంశీ, గ్రామ శాఖ అధ్యక్షుడు బక్క సాయి తేజ, యువసేన నాయకులు క్యాసగళ్ల సందీప్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి మామిడాల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు వెంకట్, ఎంఎస్‌ఎఫ్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాసగళ్ల భాను ప్రసాద్, కాసగళ్ల నరేష్, బొజ్జ సంయోగు, యశ్వంత్, నరేష్ పాల్గొన్నారు.

## ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గొంతు మార్ఫింగ్ పై

# ఎస్పీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



- ఏఐ సాంకేతికతతో తప్పుడు వ్యాఖ్యలు చేసినట్లు చిత్రీకరణ.. 'డిగ్ టీవీ పారడి' ఛానల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

భువనగిరి టౌన్, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):

భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గొంతును ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికత ద్వారా మార్ఫింగ్ చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై స్థానిక ఎస్పీకి ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. 'డిగ్ టీవీ పారడి' అనే ఛానల్‌లో ప్రసారమైన వీడియోలో ఎంపీ గొంతును మార్చి తప్పుడు వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వీడియో వాస్తవికతను పరిశీలించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలిగేట్ మెంబర్ తంగళ్లపల్లి రవికుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కదువ్వు సోమయ్య, బెండెలాల్ రాజ్, షఫీక్ అహ్మద్, కో–ఆప్షన్ సభ్యుడు పల్లెర్ల యాదగిరి, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల బాలరాజ్, సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షుడు సామల రవీందర్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అతహర్, రాము, మచ్చ రాజు యాదవ్, శరత్, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సమస్యలపై ముఖ్యమంత్రిని కలుస్తాం

### యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ



(యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా ల గ్రంథాలయం సంస్థ చైర్మన్ లో ముఖ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్బంగా చిస్తి మాట్లాడు తు గ్రంథాలయాలలో ఉన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని గ్రంథాలయ సంస్థల చైర్మన్లు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు



యాదాద్రి భువనగిరి బ్యూరో

అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):

జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం (అక్టోబర్ 12)న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ పంటల ప్రణాళిక, పంటల సాగు విధానాలు, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న నేపథ్యంలో, అక్టోబర్ 12వ తేదీన నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.

## బాదిత కుటుంబానికి ఆర్థిక సహాయం

### భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైల్ల శేఖర్ రెడ్డి



భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య)

బీబీనగర్ రైలు ప్రమాదంలో 350 పైగా గొర్రెలు కోల్పోయిన భూదాన్ పోచంపల్లి మండలం అలీనగర్ గ్రామానికి చెందిన బాలమోని కిష్టయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పైల్ల శేఖర్ రెడ్డి ఆదివారం పరామర్శించి వారి కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. కరంట్ షాక్ తో మృతి చెందిన చినాలి బాలరాజు తో పాటు పలువురికుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి , మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్ , సింగిల్ విండో మాజీ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేష్, మాజీ ఎంపిటిసి బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, నాయకులు పకీరు సుధాకర్ రెడ్డి, మన్నే పద్మా రెడ్డి యాకరి నర్సింగ్ రావు , అయిత రాజు బిక్షపతి, దిండు శశాంక్, చింతకింది కిరణ్, రాచకొండ సత్తయ్య, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

https://epaper.vaarthavedikasurya.com PRGI NO: TGTEL/25/A0305
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY


# అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు..

## కనులపండుగగా కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ వేడుకలు



**మునుగోడు, అక్టోబర్ 11(వార్త వేదిక సూర్య):**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, ప్రకృతిని ఆరాధించే అపురూప వేడుకైన బతుకమ్మ పండుగ మునుగోడు నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా ముగిసింది. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నలుదిక్కుల నుండి తరలివచ్చిన ఆడపడుచులతో కలిసి నిర్వహించిన ఈ సంబురాలు అంబరాన్నంటాయి. గుమ్మడి పూలు, తంగేడు, గునుగు, బంతి పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల మధ్య మహిళల ఆటపాటలతో, జానపద గీతాల నడుమ ప్రాంగణమంతా పండుగ శోభ సంతరించుకుంది. మునుగోడులోని క్యాంపు కార్యాలయం నుండి నియోజకవర్గ మహిళలతో కలిసి భారీ సంఖ్యలో బతుకమ్మలతో వేడుకల ప్రాంగణానికి చేరుకున్నారు. వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించి, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి 15 అడుగుల భారీ బతుకమ్మకు ప్రత్యేక హారతిచ్చి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ, బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ఇది మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, మహిళల ఐక్యతకు, కుటుంబాల సంతోషానికి ప్రతిరూపమని కొనియాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది మహిళలు తమ కుటుంబాలతో కలిసి ఈ వేడుకలకు తరలివచ్చారు. మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని, ప్రతి ఆడపడుచు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రైతులు సుభిక్షంగా ఉండి గ్రామాలు అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. నాటి పల్లె పాటల నుండి నేటి డీజే పాటల వరకు ప్రతి బతుకమ్మ పాటకు మహిళలతో కలిసి కోమటిరెడ్డి దంపతులు ఉత్సాహంగా అడుగులేశారు. ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి బతుకమ్మ ఆడే ప్రతీ మహిళ వద్దకు స్వయంగా వెళ్లి ఆప్యాయంగా పలకరించగా, తమ అభిమాన నాయకున్ని చూసి మహిళలు ఆత్మీయంగా ముచ్చటించారు. బతుకమ్మ ఆడి అలసిన మహిళలందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా కడుపునిండా భోజనాలు చేసేలా ఏర్పాట్లు చేయడంతో, అందరూ భోజనాలు ముగించుకుని సంతోషంగా తమ గృహాలకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలతో పాటు పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలి




## ఓట్ల తొలగింపును వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన

**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య )**

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హషం డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు వెళ్తున్న సీపీఎం నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఆదివారం నల్లగొండ పెద్దబండ సెంటర్‌లో నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హషం మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియతో సామాన్యులు, దళితులు, మైనారిటీల ఓట్లు తొలగిపోతున్నాయని ఆరోపించారు. సాంకేతిక కారణాలు, ధ్రువీకరణ పత్రాల పేరుతో ఓటర్లకు ఇబ్బందులు కలిగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని ప్రజాసంఘాలు ఢిల్లీలో ఆందోళన చేస్తుంటే అరెస్టులతో అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, పట్టణ కమిటీ సభ్యులు గాదె నరసింహ, అవుట రవీందర్, అద్దంకి నరసింహ, సాలివోజు సైదాచారి, గంజి రాజేష్, మన్నె శంకరయ్య, గడగోజు శ్రీనివాసచారి, తెలకపల్లి శ్రీనివాస్, చింతకాయల సంతోష్, పాక పరమేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తా

## శ్రీఆధ్య హాస్పిటల్ ఎండి. దేశిడి.రాజుగౌడ్

## మునుగోడు మండల వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు... శ్రీఆధ్య హాస్పిటల్ ఎండి. దేశిడి.రాజుగౌడ్

**మునుగోడు.. అక్టోబర్11.వార్త వేదిక సూర్య:**



శ్రీఆద్య హాస్పిటల్ ఆధ్వర్యంలో త్వరలోనే మునుగోడు మండల వ్యాప్తంగా ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తానని శ్రీఆద్య హాస్పిటల్ ఎండి. దేశిడి.రాజు గౌడ్ తెలిపార. ఆవిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నా సొంత మండలం అయినా మునుగోడు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు నా వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో అనుభవమైనటువంటి డాక్టర్లతో ప్రతి గ్రామం లో వైద్య సేవలు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాను అని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కార్యాలయానికి తరలివచ్చిన ప్రజలు

## నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**నాంపల్లి, అక్టోబర్ 11(వార్త వేదిక సూర్య):**

నల్గొండ జిల్లా నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నాంపల్లి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మహిళలు విశేష సంఖ్యలో హాజరయ్యారు.ప్రత్యేకించి నాంపల్లి మండలం నుంచి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి , మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులందరూ సపరివారంతో కలిసి హాజరై వేడుకలను మరింత శోభాయమానం చేశారు.

# భారత్–జపాన్ స్నేహ బంధాలు మరింత బలోపేతం కావాలి

## తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య )**

భారత్, జపాన్ దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్వహించిన హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్–2026 ను ఆయన ప్రారంభించారు. హైదరాబాద్, జపాన్‌లోని మియోషి నగరాల మధ్య సిస్టర్ సిటీ భాగస్వామ్యం ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జపాన్ సంస్కృతి, కళలు, సాంకేతికత, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శనలను ఆయన సందర్శించారు. భారత్–జపాన్ స్నేహ సంబంధాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఇరు దేశాల ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు విద్య, పరిశ్రమలు, సాంకేతికత, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారానికి దోహదపడతాయని అన్నారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానం, క్రమశిక్షణ, పారిశ్రామిక అభివృద్ధిలో ముందంజలో ఉందని, తెలంగాణ కూడా ఐటీ, ఔషధ పరిశ్రమలు, ఆవిష్కరణల రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందుతోందని తెలిపారు. ఇరు ప్రాంతాల మధ్య మరిన్ని భాగస్వామ్యాలు ఏర్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహాషి, మియోషి నగర డిప్యూటీ మేయర్ తెరువో యమజాకి, జపాన్ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ఐదుగురిని కాపాడిన పోలీసులు

## మిర్యాలగూడలో భవనంలో అగ్నిప్రమాదం.. సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన వన్‌టౌన్ సిబ్బంది



**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య)**

మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపురంలో చెప్పుల దుకాణం ఉన్న భవనంలో మంటలు చెలరేగడంతో పై అంతస్తుల్లో నివసిస్తున్న ఐదుగురు కుటుంబ సభ్యులు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలు, దట్టమైన పొగ మధ్య చిక్కుకున్న ఐదుగురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో సకాలంలో స్పందించి కుటుంబ సభ్యుల ప్రాణాలను కాపాడిన పోలీసుల చర్యలను అభినందించారు.

# ప్రశంసా పత్రాల ప్రదానోత్సవం

**భువనగిరి: అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య)**



భువనగిరి పట్టణంలోని 33వ వార్డు పరిధిలో గల శ్రీవాణి విద్యాలయంలో టైగర్ కుంపు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టులు మరియు ప్రశంసా పత్రాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నరసయ్య మరియు స్థానిక 33వ వార్డు కౌన్సిలర్ నాకోటి నగేష్ హాజరై, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికేట్లు అందజేసి అభినందించారు. ముఖ్య అతిథులు మాట్లాడు తూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మ రక్షణ విద్యలైన కుంపు, కరాటే ఎంతో అవసరమని, ఇవి శారీరక దృఢత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని కొనియాడారు. నిర్వాహకులు శ్రీనివాస్ కుంపు మాస్టర్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యాపేట

## ఘనంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### తొలి రోజు బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనం



**తుంగతుర్తి, అక్టోబరు 11 (వార్త వేదిక సూర్య):**

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అడ్డగూడూరు పట్టణ కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద భక్తులు దుర్గా దేవిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తొలి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు కొనసాగాయి. భక్తులు దుర్గామాత ప్రత్యేక మాలలు ధరించి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. దుర్గా దేవి తొమ్మిది రోజులపాటు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తుంది. కార్యక్రమంలో భక్తులు వెంకటేశం, సుధాకర్, శ్రీను, హరీష్, మహేష్ వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

## ఎస్‌బీ స్టోర్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ఆలేరు, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీ స్టోర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా స్టోర్ ప్రారంభం కావడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్టోర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలత్రిపుర సుందరి దేవిగా అమ్మవారి దర్శనం

### ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాల తొలిరోజు ప్రత్యేక పూజలు



**గట్టుప్పల అక్టోబర్ 11.వార్త వేదిక సూర్య:**

గట్టుప్పల మండల కేంద్రంలో నవరాత్రి ఉత్సవాల లో భాగంగా ఆదివారం తొలిరోజు దుర్గామాత అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ప్రణవ పథకవిష్కరణ అనంతరం అమ్మవారికి దేవస్థానం అధ్యక్షుడు అవ్వారి శ్రీనివాస్ మాజీ ఎంపీపీ అవ్వారి గీత శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.మాడ పాపయ్య శర్మ పురాణమఠం శివనందం విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన దుర్మమత పూజలో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## అహల్యమ్మ దశదిన కర్మ లో సీపీఐ నేతలు



**నారాయణపురం అక్టోబర్ 11.వార్త వేదిక సూర్య:**

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో దేశీడి అహల్యమ్మ దశదిన కర్మ కు సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు లతో కలిసి అహల్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, సీపీఐ మండల నాయకులు సుర్వి నరసింహ, సర్పంచ్ ముత్యాల అంజయ్య,పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య, ఈద మల్లయ్య, పల్లె గోపాల్ రెడ్డి, పల్లె రాములు, పబ్బు మారయ్య, పాల్గొన్నారు.

# దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతున్న కపిల గోశాల

**- గోశాల నిర్వహణకు ప్రభుత్వం**

**- దాతలు సహకరించాలి**

**- నిర్వాహకుడు కోరబోయిన రమేష్ విజ్ఞప్తి**

**మంథని, అక్టోబర్ -11:**
**( వార్త వేదిక సూర్య )**

మంథని మండలం భట్టుపల్లి గ్రామంలో కపిల గోశాల దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతోంది. గోవుల సంరక్షణే లక్ష్యంగా పదేళ్ల క్రితం ఆరు గోవులతో ప్రారంభించిన ఈ గోశాల నిర్వహణకు ప్రభుత్వం, దాతలు సహకరించాలని నిర్వాహకుడు కోరబోయిన రమేష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం లిపలుపత్రిక ల లిజర్నలిస్ట్ లులి గోశాలను సందర్శించిన సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, 2016లో మౌన స్వామి స్ఫూర్తితో గోశాలను ప్రారంభించినట్లు తెలిపారు. హిందూ సంప్రదాయాల్లో గోవుకు విశిష్ట స్థానం ఉందని, అయినప్పటికీ అనేక గోవులు సంరక్షణకు నోచుకోక కబేళాలకు తరలిపోతుండటాన్ని చూసి చలించిపోయానని చెప్పారు. వాటిని రక్షించి, పోషించాలనే సంకల్పంతో గోశాల నిర్వహణ బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. గతంలో యోగా కార్యక్రమాల్లో యోగా గురువు రాందేవ్ బాబాతో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తుచేశారు. గోశాల ప్రారంభించిన సమయంలో పరిసర ప్రాంతమంతా బీడు భూమిగా ఉండేదని, ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పంట పొలాలుగా మారడంతో గోశాలకు అందుబాటులో ఉన్న స్థలం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోశాలను విశాలమైన ప్రదేశానికి తరలించి, మరింత విస్తరించేందుకు పలువురు రాజకీయ నాయకులతో పాటు జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించినప్పటికీ ఆశించిన సహకారం అందలేదన్నారు. కొన్ని రాష్ట్రాల్లో గోవుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని, గోశాలల ద్వారా పేడ, గోమూత్రం విక్రయాలకు కూడా ప్రోత్సాహం లభిస్తోందని తెలిపారు. అయితే తమ గోశాలకు ప్రభుత్వ అధికారుల నుంచి తగిన సహకారం అందడం లేదని, తెలిసిన మిత్రుల సహాయంతోనే గోవులకు ఆహారం అందిస్తూ పోషిస్తున్నామని చెప్పారు. పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు స్థానికంగా అందుబాటులో ఉన్న వైద్య సహాయంతో చికిత్స చేయిస్తున్నామని తెలిపారు.

ఇటీవల అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకుని, అందులోని పశువులను తమ గోశాలకు అప్పగించారని రమేష్ వెల్లడించారు. భట్టుపల్లి గిరిజనుల వద్ద కొంత భూమిని కొనుగోలు చేశామని, భూమిని ఇచ్చిన వారిలో కొందరు తమ ట్రస్టు సభ్యులుగా కొనసాగుతున్నారని వివరించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ దృష్టికి గోశాల సమస్యలను తీసుకెళ్లగా, బోరు వేయించి షెడ్డు గోడల నిర్మాణానికి సహకరించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు ఎంపీడీవో ద్వారా సంప్రదించి కలెక్టర్‌ను కలిశామని, గోశాలకు షెడ్డు నిర్మాణంతో పాటు మరికొంత భూమి కేటాయించాలని కోరినట్లు చెప్పారు. అయితే గోశాలలో పశువులు లేవనే కారణంతో సహాయం



అందించేందుకు నిరాకరించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గోశాల పరిస్థితిపై తప్పుడు సమాచారం వెళ్లి ఉండవచ్చని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్ స్వయంగా గోశాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి సహకారం అందించాలని కోరారు. గోవుల సంరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. గోశాల నిర్వహణకు అవసరమైన స్థలం, షెడ్లు, పశువుల మేత, వైద్య సదుపాయాల కల్పనలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు తోడ్పాటు అందిస్తే మరిన్ని గోవులకు ఆశ్రయం కల్పించవచ్చని తెలిపారు. ఆయన వెంట విశ్వ హిందూ పరిషత్ సభ్యులు హరి ప్రసాద్, రావుల సతీష్, గ్రామ సర్పంచి రవి, గ్రామ పెద్దలు మహాదేవ్, పోసాలు, ట్రస్ట్ సభ్యులు సరిత, పూజ తదితరులు ఉన్నారు.



# పెద్దపల్లి

## ఎల్‌నినో పరిస్థితులు యాసంగి సాగు ప్రణాళికపై సీఎం వీడియో కాన్ఫరెన్స్

**రైతు వేదికలో పాల్గొనాలని ఏఈఓ ఆహ్వానం**




**మంథని ప్రతినిధి, అక్టోబర్ -11, ( వార్త వేదిక సూర్య ):**

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగి పంటల సాగు ప్రణాళికపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించనున్న వీడియో కాన్ఫరెన్స్‌కు మంథని క్లస్టర్ పరిధిలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు హాజరుకావాలని మంథని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) కోరారు. సోమవారం (అక్టోబర్ 12) ఉదయం 11:30 గంటలకు మంథని మండలం సూరయ్యపల్లి రైతు వేదికలో ఈ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగి పంటల సాగు ప్రణాళికపై రైతులతో చర్చించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున మంథని క్లస్టర్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఈఓ విజ్ఞప్తి చేశారు.

## శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి దేవస్థాన

# నూతన కమిటీకి ఘన సత్కారం

**మంథని, అక్టోబర్ -11, (వార్త వేదిక సూర్య ):**

మంథని మండలం విలోచవరం గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి దేవస్థాన నూతన పాలకమండలి సభ్యులను మంథని మాజీ ఎంపీపీ కొండ శంకర్, విలోచవరం మాజీ సర్పంచ్ కొండ విజయలక్ష్మి దంపతులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ కావేటి రవి యాదవ్, వైస్ చైర్మన్ జునుగరి సుమన్లతో పాటు కార్యవర్గ సభ్యులకు



పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన కార్యవర్గ సభ్యులు: భీముని రాజమల్ల గౌడ్, కొటం రాజేష్,గుర్రాల సంతోష్, బోగిరి కార్తీక్, ఎరుకల సుధాకర్, పుట్ట సంతోష్

ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొండ శంకర్ మాట్లాడుతూ...నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని, స్వామివారి సేవలు నిరంతరం దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 18 శక్తిపీఠాల వైభవం.. పోచమ్మవాడలో శరన్నవరాత్రి శోభ

**- 18వ వసంతంలోకి అడుగుపెట్టిన దుర్గ సంస్థ**




**మంథని, అక్టోబర్ -11: (వార్త వేదిక సూర్య ):**

భక్తిభావం వెల్లివిరియగా.. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడగా.. మంథని పట్టణంలోని పోచమ్మవాడలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పోచమ్మవాడ దుర్గ సంస్థ 17 వసంతాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 18వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 18 శక్తిపీఠాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలిరోజు బాలా త్రిపురసుందరి దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమివ్వడంతో ఆ ప్రాంతమంతా భక్తి పారవశ్యంలో మునిగిపోయిందిసంస్థ 18వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ శక్తిపీఠాల అలంకరణతో అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేయడం ఉత్సవాలకు మరింత విశిష్టతను తీసుకొచ్చింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలతో పోచమ్మవాడలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

# సింగరేణి సంస్థను కాపాడుకునేందుకే బీఆర్ఎస్ పోరాటం

**- ఆనాడు కేసీఆర్ గ్లోబల్ సంస్థగా మార్చాలని చూస్తే**

**- ఈనాడు జేబు సంస్థగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు**

**- సంస్థ రాష్ట్ర వాటాలో 10శాతం అమ్మాలనే ఆలోచన చేస్తుండ్లు**

**- కార్మికుల ప్రయోజనాల కోసం సింగరేణి కార్మిక గర్జన**

**మాజీ ఎంపీ, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్**

**మంథని, అక్టోబర్ -11, (వార్త వేదిక సూర్య):**

మన ప్రాంతాన్ని, మన సంస్థను కాపాడుకోవాలన్నదే బీఆర్ఎస్ ఆలోచన అని, అందుకోసమే పోరాటం చేస్తున్నామని మాజీ ఎంపీ, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆదివారం మంథని పట్టనంలోని రాజగృహా లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంస్తను బడేబాయ్ నరేంద్ర మోడీ చోటే బాయ్ రేవంత్‌రెడ్డి మిడిల్‌బాయ్ కిషన్‌రెడ్డి ముగ్గురు కలిసి సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈనాడు తెరవెనుక చర్చలు జరుపుతూ సంస్థ 51శాతం రాష్ట్ర వాటాలో 10 నుంచి15శాతం అమ్ముదామా అనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. రెండేళ్ల కాలంలోనే సింగరేణి సంస్థను నాశనం చేశారని ఆయన వాపోయారు. గతంలో కేసీఆర్ సింగరేణి సంస్థను మరింత విస్తరింప జేయాలనే గొప్ప ఆలోచనతో సీఎండీని అనేక దేశాలు పంపించారని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనే గొప్ప ఆలోచన చేశారన్నారు. సంస్థను గ్లోబల్ ఆర్గనైజేషన్ చేయాలని చూస్తే ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం జేబు సంస్థగా మార్చుకున్నారని, ఇందులో అందరూ వాటా దారులేని, ముఖ్యమంత్రితో సహా మంత్రులు శ్రీధర్‌బాబు అడ్లూరి లక్ష్మన్, వివేక్‌లకు వాటా ఉన్నయి కనుకనే మాట్లాడుతలేరన్నారు. ఈ ప్రాంత ఓట్లతో గెలిచిన వారు ఎందుకు మాట్లాడుతలేరో అర్థం చేసుకోవాలన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడటం కోసమే బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, ఇందులో బాగంగా ఈనెల 14న రామగుండం లో బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభ పెట్టినట్లు తెలిపారు. ఈ సభ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసకువచ్చి కార్మికులకు మేలు చేయాలన్నదే లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు మెడికల్ బోర్డు పెట్టలేదని, ఎవరైనా వెళ్తే వెనక్కి పంపిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 76జీఓ కింద 30వేల కుటుంబాలకు జాగలు ఇచ్చామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో జీఓ ద్వారా ఒక్కరికి పట్టా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో కార్మికుల ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చారని, అందులో ఒక్కటి అమలు చేయకుండా కార్మిక లోకాన్ని మోసం చేశారన్నారు. అంతేకాకుండా సింగరేణి సంస్థ లాబాల్లో గణనీయంగా వాటాలు ఇచ్చిన చరిత్ర కేసీఆర్‌దేనని,




కానీ ఈనాడు లాబాల్లో వాటా చూపిస్తూ కోత విధిస్తున్నారని అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ఈ క్రమంలో రామగుండంలో నిర్వహించే సింగరేణి కార్మిక గర్జనకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పెద్దపల్లి లో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు

**- టి ఆర్ పి జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్**

**పెద్దపల్లి స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ -11 ( వార్త వేదిక సూర్య ) :**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మాధం. రజని కుమార్ యాదవ్,రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా సూచనల మేరకు పార్టీ బలోపేతంలో భాగంగా పెద్దపల్లి జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో పలువురు చేరికలు జరిగాయి.

జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ఫరీద్ ఆధ్వర్యంలో మైనారిటీ మహిళలు, అలాగే జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ ఆధ్వర్యంలో పాలకుర్తి మండలం నుండి చేరికలు జరిగాయి. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది.

నూతనంగా నియమితులైన వారు:

1. పెద్దపల్లి మండల మైనారిటీ మహిళా అధ్యక్షురాలిగా - రహమత్ బేగం
2. పెద్దపల్లి మండల మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా - ఆఫ్రీన్ బేగం
3. పెద్దపల్లి మండల మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ గా - ఆర్ఫియా ముస్కాన్
4. పెద్దపల్లి మండల మైనారిటీ జనరల్ సెక్రటరీగా - ఆసియా బేగం
5. పెద్దపల్లి మున్సిపల్ మైనారిటీ మహిళా అధ్యక్షురాలిగా - ఫాతిమా బీ
6. పాలకుర్తి మండల అధ్యక్షుడిగా - మూడి శివ కుమార్
7. పాలకుర్తి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా - ఇస్లావత్ విజయ్.

ఈ కార్యక్రమంలో

జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్, జిల్లా



వైస్ ప్రెసిడెంట్ మెరుగు సతీష్ గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ కాంపెల్లి స్వామి, జిల్లా కార్యదర్శి కుమ్మరి పరమేష్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ఫరీద్, పెద్దపల్లి మండల అధ్యక్షులు వెంగల కృష్ణ, పెద్దపల్లి మండల అధ్యక్షులు ఎర్ల ప్రశాంత్, పెద్దపల్లి మైనారిటీ మండల అధ్యక్షులు అమీనుల్లా, అజార్, నాయకులు కళాబోయిన సంపత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 144 || సోమవారం || అక్టోబర్ 12, 2026



# మహబూబ్‌నగర్

## విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం..

# సబ్‌స్టేషన్ ఎదుట వంటావార్పుతో నిరసన

- సాగుకు సక్రమంగా కరెంటు, నీరు అందించాలని డిమాండ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**

తెలంగాణలో రైతులు విద్యుత్ సరఫరా అంతరాయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఊర్కొండపేట మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ఊర్కొండ మండలం జాకినాలపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఊర్కొండపేట, జాకినాలపల్లి గ్రామాల రైతులతో కలిసి ఆయన ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే కాలువల ద్వారా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు, పంటలకు నీరు అందించలేక ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.





**విద్యుత్ కోతలు నివారించి, వ్యవసాయానికి నిరంతర సరఫరా అందించాలి**

పంటలు ఎండిపోకుండా విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. రైతుల కష్టాలను పట్టించుకోకపోతే వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు రామాంజనేయులు, సూక్కపురం అంజయ్య, శ్రీధర్‌రెడ్డి, కటమోని జంగయ్య, ఆలకుంట మల్లేష్, కప్పర చంద్రయ్య, సురేందర్, సాయిరెడ్డి, మోటపురం యాదయ్య, బాల్రాజ్, సిరిగిరి జంగయ్య, జల్లయ్య, పోలే కృష్ణయ్యతో పాటు ఊర్కొండపేట, జాకినాలపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటితో పేద కుటుంబంలో కొత్త వెలుగులు

**జడ్చర్ల 14వ వార్డులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శుభాకాంక్షలు..**

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**



ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు అందడం ఆనందాన్ని కలిగిస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణంలోని 14వ వార్డు సంజీవయ్య కాలనీలో ఇందిరమ్మ ఇంటిని పొందిన కాటేపాగా అరుణ, శివకుమార్ దంపతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సొంతిల్లు ప్రతి పేద కుటుంబానికి ఒక కల అని, ఆ కల నెరవేరడం వారి జీవితాల్లో భరోసాను నింపుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు కేవలం నివాసం మాత్రమే కాకుండా కుటుంబ భవిష్యత్తుకు పునాది అని తెలిపారు. అర్హులైన పేదలకు సొంతింటి కల సాకారం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాలు వారికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇంటిని పొందిన దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

## పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు

**అమ్మవారిని దర్శించుకున్న మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ..**



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**

మహబూబ్‌నగర్‌లోని శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నగర మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, నగరంలో సుఖశాంతులు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పార్వతమ్మ చిత్రపటానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నివాళులు

**నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ.. ప్రగాఢ సానుభూతి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**



మహబూబ్‌నగర్ జిల్లా ధర్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధర్మాపూర్ నర్సింహారెడ్డి తల్లి స్వర్గీయ పార్వతమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్వతమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి..
- వన మహోత్సవంలో మొక్కల పంపిణీ



**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సూచించారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పట్టణ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సంరక్షించాలని కోరారు. మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడటమే కాకుండా భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ప్రజలంతా వన మహోత్సవంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## నేడు ఎంపీ డీకే అరుణ పర్యటన..

**మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు హాజరు.. ఆత్మకూరులో షోరూమ్ ప్రారంభం..**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**



మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సోమవారం 12 న జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆమె పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

ఉదయం 10 గంటలకు మన్యంకొండలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఆత్మకూరులో ఎలక్ట్రికల్ షోరూమ్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు అమరచింతలో స్వర్గీయ మహంకాళి విష్ణు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. ఎంపీ పర్యటనకు సంబంధించిన వివరాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని సూచించారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య :**

నాగర్ కర్నూల్ జిల్లాలో చిన్న పురంపల్లి ప్రాథమిక పాఠశాలలో 1998 99 సంవత్సరంలో ఐదో తరగతి పూర్తి చేసుకున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు అందరూ ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం చేసుకోవడం జరిగింది. అందులో చాలామంది అబ్బాయిలు అమ్మాయిలు చాలా హ్యాపీగా తన యొక్క పూర్వజ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ చాలా సంతోషంగా విద్యార్థిలో అందరూ కూడా వారి యొక్క జీవితంలో జరిగినటువంటి కొన్ని సన్నివేశాలను కొన్ని సందర్భాలను వాళ్ళు ప్రతి ఒక్క విద్యార్థులతో పంచుకున్నారు. ప మనమందరం ఎలాంటి సమస్యలు వచ్చిన కూడా సహాయ సహకారాలతో ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమం చేసినటువంటి ప్రతి ఒక్కరు కూడా మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం అదేవిధంగా ఈ విద్యార్థులు 5వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం చేసుకోవడం ఈ చిన్న పురంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మొట్టమొదటిసారిగా జరిగింది అన్నారు. మనం అందరం కూడా 10వ తరగతి విద్యార్థుల పూర్వ సమ్మేళనం చూస్తుంటాం కానీ ఐదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సంతోషంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమం లో అక్కడ ఉన్నటువంటి చాలామంది అమ్మాయిలు అమ్మాయిల పేర్లు చెప్పుకున్నట్లయితే శివ గీత సునీత లాలమ్మ పుష్పలత లక్ష్మి రాధా జ్యోతి సంతోషి ఈ విధంగా చూసుకుంటే అబ్బాయిలు కూడా చాలామంది రవికుమార్ రాంబాబు మైసను, మై మధు బాలరాజు నరసింహ నిరంజన్ ఆంజనేయులు శివుడు ఇలా చాలామంది విద్యార్థులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగింది.

## తిరుమలనాథ స్వామి ఆలయ మహోత్సవాలకు ఎమ్మెల్యే కి ఆహ్వానం

- 14 నుంచి 16 వరకు చొక్కంపేటలో ప్రత్యేక పూజలు, కళ్యాణ మహోత్సవం..

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**

రాజాపూర్ మండలం చొక్కంపేట గ్రామంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ స్వయంభు లక్ష్మీ సమేత తిరుమలనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణం, గరుడ ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు కళ్యాణ మహోత్సవానికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, జనంపల్లి శశికళ, జనంపల్లి దుష్యంత్‌రెడ్డిలను కాంగ్రెస్ నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారికి ఆహ్వాన పత్రిక అందజేసి, ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆవులమంద వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నరసింహ, ఆవులమంద గణేష్, కుత్నెపల్లి ఇందిరమ్మ కమిటీ సభ్యుడు దేవావత్ రమేష్ నాయక్, కుత్నెపల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాగపల్లి సుధాకర్, రాఘవపూర్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ఎంఎంఎస్ స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతం

- 120 మంది విద్యార్థులకు పది రోజుల రెసిడెన్షియల్ శిక్షణ..

**మరో 250 మందికి ఆన్‌లైన్ తరగతులు..**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 11 (వార్తా వేదిక సూర్య):**



మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల, మాడ్రన్ హైస్కూల్‌లలో పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణను వన్‌టౌన్ సీఐ అప్పయ్య, టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్ పరిశీలించారు. గత విద్యా సంవత్సరంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ ద్వారా 60 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించారని మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి తెలిపారు. గత ఏడాది విజయంతో స్ఫూర్తి పొంది ఈసారి అధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 120 మంది విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 31 వరకు గొల్లపల్లిలోని లలితాంబికా తపోవనంలో నిపుణులైన అధ్యాపకులతో పది రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మరో 250 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌ల సాధనకు విద్యార్థులను సిద్ధం చేయడం, పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించేలా నాణ్యమైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించడమే లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించగా, కార్పొరేటర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## పాలెం వెంకన్న ఆలయంలో దుర్గా మాత పూజలు



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :**

బిజినెపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలోనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ దుర్గా మాత పూజలను ఫ్రెండ్స్ యూత్,శ్రీ పద్మావతి మాతృమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. దుర్గా అమ్మవారిని బాలాత్రిపుర సుందరి మాతగ అలంకరించారు. పురోహితులు జయంత్,చక్రవర్తుల ఆధ్వర్యంలోఉదయం విగ్రహ ప్రతిష్ఠ,అభిషేకం, కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం, నిత్యపూజలు,కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహిళ భక్తులు బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజ కార్యక్రమంలో వోరుగంటి ఆనంద్ రజిత,జున్ను వెంకట నారాయణరెడ్డి రాములమ్మ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద్ వెంకటేష్,అఖిలేష్,శ్రీను,అల్లోజీ,విఠల్, కార్తీక్,సాయి చరణ్ , వినయ్,అర్చితు,ఆశ్రిత్, రాజేశ్వరి,బి.పద్మ ,ఎస్ . శారద,మంజుల, తదితరులు పాల్గొన్నారు.



# రంగారెడ్డి

# సంగారెడ్డి పోస్టల్ డివిజన్‌లో ఘనంగా
# తపాలా వారోత్సవాలు




**- పోస్టల్ ఎస్పీ బి.అంబేద్కర్ రాజు**

సంగారెడ్డి,వార్త వేదిక సూర్య ప్రతినిధి అక్టోబర్ 11:

సంగారెడ్డి పోస్టల్ డివిజన్ పరిధిలో జాతీయ తపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 నుండి 15 వరకు ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పి బి. అంబేద్కర్ రాజు తెలిపారు. ఈ నెల 9 న వరల్డ్ పోస్ట్ డే ను జరిపారు. నేషనల్ పోస్టల్ వీక్ ను పురస్కరించు కొని సంగారెడ్డి జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా



జహీరాబాద్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ బి. రత్నయ్య ఆధ్వర్యంలో చరాకుపల్లి సబ్ ఆఫీస్ పరిధిలోని ఖాసింపూర్ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లో 'డాక్ చౌపాల్ ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్స్పెక్టర్ బి. రత్నయ్య మాట్లాడుతూ పోస్టల్ డిపార్ట్మెంట్లో ఉన్నటువంటి వివిధ పొదుపు పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఒకేరోజు 150 పొదుపు ఖాతాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖాసింపూర్ సర్పంచ్ బి.రవి, ఉప సర్పంచ్ రమేష్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అలాగే సంగారెడ్డి సబ్ డివిజన్ కింద కౌడిపల్లి సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని ఎల్మకన్న బ్రాంచ్ పోస్టాఫీస్ లో "తపాలా సేవల సమీకృత సమ్మేళనం" ప్రోగ్రాం నిర్వహించినారు. సబ్ డివిజన్ ఏఎస్పీ వెంకన్న ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పి వెంకన్న మాట్లాడుతూ పోస్టల్ సేవలు గురించి ప్రజలకు విపులంగా వివరించారు. డి సి డి పి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివ లీల సతీష్ , గ్రామ సెక్రటరీ, సంగారెడ్డి ఐపిపిబి సీనియర్ మేనేజర్ వెంకట్రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవింగ్ ఖాతాలు 282 ఓపెన్ చేశారు. గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది. అదే విధంగా జహీరాబాద్ మండల పరిధిలో నీ గుడ్ పల్లి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లో డాక్ చౌపల్ మీటింగ్ నిర్వహించి 60 పొదుపు ఖాతాలను ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోనీ గొట్టిముక్కుల బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లో ఒకేరోజు 135 ఖాతాలు ప్రజలు ఓపెన్ చేసుకున్నారు. సిరిపురం సబ్ పోస్టాఫీసు లో డి సి డి పి అవగాహన సమావేశం నిర్వహించారు.పోస్టల్ ఎస్పి ఆదేశాల మేరకు ఆర్ సి పురం సబ్ డివిజన్ పరిధిలో కూడా వారోత్సవాల సందర్భంగా బి వో మేళా లు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ ఇన్స్పెక్టర్ రఘువీర్ తెలిపారు. ఈ నెల 13 న పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డే, గ్రామీణ తపాల జీవిత బీమా రోజు ను నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగ పరుచుకోవాలని పోస్టల్ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి పోస్ట్ మాస్టర్ బి. సాయిలు, జహీరాబాద్ పోస్ట్ మాస్టర్ సుభాష్, మెయిల్ ఓవర్ సీర్ లు శ్రీనివాస్, కిషన్, శంకర్, వీరేశం, యూనుస్, ఉమాకాంత్ , బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, గ్రామీణ డాక్ సేవక్ లు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 26న రాజేంద్రనగర్‌లో పూలే ద్విశత జయంతి ఉత్సవ సభ




**పూలే--అంబేడ్కర్ భావజాల ప్రచారానికి విస్తృత కార్యాచరణ**

రాజేంద్రనగర్, అక్టోంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :

మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాజేంద్రనగర్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా 2026 నవంబర్ 26న రాజేంద్రనగర్‌లో పూలే జయంతి ఉత్సవ సభ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్‌నగర్ అంబేడ్కర్ సంఘం భవనంలో స్థానిక నాయకులు, మేధావులు, సామాజిక కార్యకర్తలతో ఈ సమావేశం నిర్వహించారు. పూలే--అంబేడ్కర్ ఆలోచనా సమితి (పాస్), తెలంగాణ డిగ్రీ కళాశాల బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ (టీడీబీసీఎల్ఏ) సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహించ నున్నాయి.పూలే--అంబేడ్కర్ భావజాలంపై కృషి చేస్తున్న ప్రముఖ మేధావులు, సామాజిక ఉద్యమకారులు, విద్యావేత్తలను సభకు వక్తలుగా ఆహ్వానించాలని సమావేశంలో నిర్ణయించారు. ఉత్సవాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు, సామాజిక సమానత్వం, విద్యా ప్రాధాన్యత, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చించారు. పూలే--అంబేడ్కర్ భావజాలంపై కృషి చేస్తున్న ప్రముఖ మేధావులు, సామాజిక ఉద్యమకారులు, విద్యావేత్తలను సభకు వక్తలుగా ఆహ్వానించాలని సమావేశంలో నిర్ణయించారు. ఉత్సవాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు, సామాజిక సమానత్వం, విద్యా ప్రాధాన్యత, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చించారు.ఈ సమావేశంలో పూలే--అంబేడ్కర్ ఆలోచనా సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.ఏ. మాలిక్, మదనం గంగాధర్, ద నేషనల్ అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంబల రాజు, గుడిసె యాదయ్య, సురేష్, శ్యామ్ రాజ్, జగన్మోహన్, పవన్ కుమార్, గొడుగు సంజీవ్, పెంటయ్య, రవీందర్, రమేష్, బాబూరావు, షేక్ అక్బర్, నాగేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీగూడ పింక్ కాలనీలో మూడు నెలలుగా
## వెలగని వీధి దీపాలు!



**- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు..**

**- రాత్రివేళ మహిళలకు తప్పని ఇబ్బందులు**



రాజేంద్రనగర్, అక్టోంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ ఫేజ్-2 పింక్ కాలనీలో గత మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో కాలనీలోకి వెళ్లే రహదారి రాత్రివేళల్లో చీకటిమయంగా మారుతోంది. ముఖ్యంగా మహిళలు రాత్రిపూట రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు స్థానిక నాయకులకు తెలియజేయడంతో పాటు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలను వెంటనే పునరుద్ధరించాలని, రాత్రివేళ మహిళలు, కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## మూసీ సుందరీకరణ పేరుతో అదనపు భూసేకరణ ఆపాలి

**-మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, బండ్లగూడ జాగీర్ వాసులు**

రాజేంద్రనగర్, అక్టోంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :



మూసీ సుందరీకరణ పేరుతో బఫర్ జోన్ పరిధి దాటి 500 మీటర్ల వరకు భూసేకరణ చేపట్టాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, బండ్లగూడ జాగీర్ దర్గా కాలేజ్ ప్రాంత నివాసితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆయన అధికారిక నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు.మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే బఫర్ జోన్ పరిధి దాటి భూములు సేకరించడం వల్ల తీవ్రంగా నష్టపోతామని నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. బఫర్ జోన్ పరిధిలో అవసరమైన భూములను మాత్రమే సేకరించాలని, అదనపు భూసేకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కీలక నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి తమ భూములు, నివాసాలను కాపాడాలని బండ్లగూడ జాగీర్ వాసులు కోరారు.



## ఎంగిలి పూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

**- బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్**

దేవరకొండ అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):-





చింతపల్లి మండల పరిధి లోని గోడుకొండ్ల టమాల్‌ఊ లో స్థానిక సర్పంచ్ కాశగొని వెంకటయ్య గారి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఏర్పాటు ఎంగిలి పూల బతుకమ్మ సంబ రాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బి ఆర్ ఎస్ పార్టీ దేవరకొండ నియోజ కవర్గం నాయకులు వడ్త్య రమేష్ పాల్గొన్నారు వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ గారితో పాటు కేతావత్ బిల్యా నాయక్ ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పాల్గొన్నారు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బొడ్డు మధు, పోలేపల్లి నరేష్, ఆకుతోట నరసింహా, కాసగొని యాదయ్య, శ్రీను, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## ఎంగిలి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కేతావత్ భీల్యా నాయక్

దేవరకొండ అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):-





చింతపల్లి మండల పరిధిలోని గోడకొండ్ల గ్రామంలో జరిగిన ఎంగిలి పువ్వు బతుకమ్మ వేడుకల్లో స్థానిక నాయకులు ఆహ్వానం మేరకు శనివారం రాత్రి కార్యక్రమంలో పాల్గోని సందడి చేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ అనంతరం వారు మాట్లాడుతూ మన తెలంగాణా ఆడపడుచులకు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పండుగ అని అందరు కలిసి మెలసి ఎంతో ఘనంగా జరుపుకోవడం సంతోషదాయకం అని అన్నారు ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు కేతావత్ బీల్యా నాయక్ గారికి స్వాగతం పలికి సన్మానించారు

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాశగోని వెంకటయ్య దంపతులు,ఉప సర్పంచ్ ఎండీ ,ఖలీల్, గ్రామ కార్యదర్శి మురళివార్డు సభ్యులు దేసిడి నర్సింహ, పాలకూర్ల శంకర్,వీర మళ్ళ శంకర్,ఉడుతల వెంకటేష్,తమ్మడగోని శంకర్,జిట్ట జగదీష్,ఎండీ బుజ్జి బాహి,సైదులు, అంకం శ్రీను, అండేకార్ హరి,కనక చారి, జావీద్,రాము, అలాగే ఆకుతోట నర్సింహ,గోట్టె పర్వాతాలు,కాశగోని యాదయ్య, పోలేపల్లి నరేష్,గనగోని అశోక్ యాదవ్,బాదేపల్లి వెంకటయ్య,అంకం ప్రవీణ్,కేతావత్ హరి నాయక్,బొడ్డు మదు, ఆర్కపల్లి శేఖర్, జైపాల్ నాయక్,శ్రీకాంత్, మహిళ మనులు తదితరులు పాల్గొన్నారు

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 144
సోమవారం
12 అక్టోబర్ 2026

# జనసేన పార్టీ నాయకులు హెల్ప్ డిస్క్ ద్వారా పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం



జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోర్ర చందు నాయక్



**దేవరకొండ అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):-**

దేవరకొండ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో ఖమ్మం - నల్లగొండ - వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియ ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశేష హెల్ప్ డిస్క్ ద్వారా పట్టభద్రులకు ఓటు హక్కు నమోదును సులభతరం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు ?డిగ్రీ పూర్తి చేసుకుని మూడేళ్లు పూర్తయిన పట్టభద్రులందరినీ భాగస్వాములను చేస్తూ జనసేన పార్టీ నాయకులు ఆన్‌లైన్ ద్వారా ఓటర్ల నమోదు పూర్తి చేసి దరఖాస్తులను అందజేశారు?

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోర్ర చందు నాయక్ మాట్లాడుతూ పట్టభద్రులు చట్టసభల్లో తమ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవడానికి ఓటు హక్కు కీలక సాధనమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకోవాలని, పట్టభద్రుల సమస్యలపై పోరాడే సరైన నాయకుడిని ఎన్నుకోవడానికి ఇది వేదిక అని ఆయన పిలుపునిచ్చారు జనసేన పార్టీ ఎల్లప్పుడూ నిరుద్యోగ, పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం ముందుంటుందని స్పష్టం చేశారు ?ఈ హెల్ప్ డిస్క్ ద్వారా పలువురు పట్టభద్రులు తమ వివరాలను నమోదు చేసుకుని పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు నల్లవెల్లి శ్రీనివాస్, కాటిపాక నవీన్, పట్టభద్రుడు అంజితో పాటు ఇతర జనసేన నాయకులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొన్నారు

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు



**సికింద్రాబాద్, అక్టోబర్ 11(వార్త వేదిక సూర్య)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని అంబర్ నగర్‌లో మహిళలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మంద భవాని జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, ఐక్యత, సంప్రదాయ వైభవాన్ని చాటిచెప్పేలా ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ సందర్భంగా మహిళలు ఒకరికొకరు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకల్లో పాల్గొన్నారు. అంబర్ నగర్‌లో పండుగ సందడి నెలకొనగా, మహిళల ఆనందోత్సాహాలతో కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది.

ఈ కార్యక్రమంలో మంద రాజేశ్వరి, రాజమణి, పావని, మంగ, రాజమణి, వేముల శ్వేత, లాలు, గాయత్రి, మమత, భాయ్, సుధారాణి, స్నేహిత, వేముల అశ్విత కలమ్మ లక్ష్మి కావ్య పారిజాత లలిత అనిత జయంతి శ్రావ్య స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంపు



### ప్రారంభించిన జనసేన నాయకులు ముమ్మరెడి ప్రేమ కుమార్.

**కూకట్ పల్లి, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య) :**

కూకట్ పల్లి నియోజకవర్గం, గాయత్రి నగర్ డివిజన్ వేవేకానంద నగర్ రాయల్ ఓక్స్ స్కూల్ లో జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో రివైవ్ మల్టీ స్పెషల్ హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసినటువంటి మెడికల్ క్యాంపు కార్యాలయాన్ని ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, స్థానిక ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. డయాబెటిక్ ఫుట్, వెరికోవెన్స్, రక్తనాళాలు, సాధారణ ప్రసవం, మోకాళ్ళ సమస్య, మెదడు వ్యాధులు, చిన్నపిల్లల డాక్టర్, అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు సహాయపడతాయని తెలిపారు. ఇటువంటి ప్రజాసేవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వీర మహిళలకు, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ మెంబర్ ప్రజిత్ గౌడ్, కొల్లా శంకర్, శ్రీనివాస్ గోవిందా, పవన్, వీరబాబు, వీర మహిళలు దుర్గ లక్ష్మి, రత్న వేణి, నాగ వరలక్ష్మి, రాధిక, సింధు, వానిదేవి, శ్రీదేవి, సరోజినీ, నారాయణమ్మ, సుజాత, సత్య, భూలక్ష్మి, సత్యవతి, నాగలక్ష్మి, కుమారి, వీర వేణి, విజయలక్ష్మి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఆస్బెస్టాస్ కాలనీలో వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పెద్దపీట

### బతుకమ్మ పోటీల్లో విజేతలకు చీరలు, ప్రశంసాపత్రాల ప్రదానం.



**కూకట్‌పల్లి, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య) :**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆస్బెస్టాస్ కాలనీలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆస్బెస్టాస్ కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ--పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో అనుముల స్వప్న కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళల సందడి, బతుకమ్మ పాటలు, సంప్రదాయాల నడుమ ఉత్సాహభరితంగా సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతోపాటు మహిళల్లో ఐక్యతను పెంపొందించి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బతుకమ్మ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, తంగేడు తదితర రంగురంగుల ప్రకృతి పూలతో బతుకమ్మలను అత్యంత అందంగా అలంకరించి తీసుకువచ్చారు. వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకోగా, పండుగ ప్రాంగణమంతా పూల పరిమళాలు, మహిళల కోలాహలంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆరుగురు విజేతలను ఎంపిక చేసి వారికి చీరలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు తెలంగాణ పండుగల ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాకుండా మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, ప్రకృతితో మనిషికి ఉన్న విడదీయలేని సంబంధానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. స్థానిక దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలు కాలనీవాసుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. సంప్రదాయ బద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొన్న మహిళలు తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పారు. ఇటువంటి వేడుకలను ప్రతి సంవత్సరం నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాలను కాపాడుకోవడ ంతోపాటు మహిళలకు ప్రోత్సాహం అందించవచ్చని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేష్‌తోపాటు శివకేశవ గౌడ్, రఫీక్, మహమూద్, విజయ్, గంధం శ్రీనివాస్, వాసాల రమేష్, మురళి, క్రాంతి రాథోడ్, లక్ష్మీ నరసింహ, ఎల్. సిద్దయ్య, పొన్నాల నాగరాజు, మున్నా తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయానికి అద్దం పట్టిన ఈ ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఆస్బెస్టాస్ కాలనీలో పండుగ శోభను నింపాయి.



# నల్లగొండ



## ఎంగిలి పువ్వుల బతుకమ్మ కార్యక్రమంలో పాల్గొన్న గుడిపల్లి సర్పంచ్ కొండ్రెడ్డి రాజశేఖర్ రెడ్డి

**దేవరకొండ అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య ):-**

నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం గుడిపల్లి మండల కేంద్రంలో శనివారం రాత్రి గుడిపల్లి గ్రామపంచాయతీ రామాలయం వద్ద ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు అందరూ కలిసి నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలో పాల్గొని గ్రామ ప్రజలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపి ప్రజలందరూ కూడా గ్రామంలో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా ఆడుతూ పాడుతూ జీవించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అరపల్లి శ్రీను వార్డు సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు ప్రజలు దుర్గ మాత ఆలయ కమిటీ సభ్యులు రామాలయం కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతంగా బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించినారు

## మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవం

### ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్.

**కూకట్ పల్లి, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య) :**



శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ, చాలీస్ మాఖాన్ లోనీ దర్గాలో నిర్వహించిన పవిత్ర గ్యార్వీ షరీఫ్ కార్యక్రమంలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముస్లిం సోదరులతో కలిసి పాల్గొని అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవం అని, అందరూ సామరస్యంగా జరుపుకునే వేడుక అని అన్నారు. కుల మతాలకు అతీతంగా అందరూ అన్ని పండగలు కలిసిమెలసి జరుపుకోవాలని తెలియచేశారు. విభిన్న మతాలు, భిన్న విశ్వాసాలు మన సమాజానికి బలమే కానీ విభజనకు కారణం కాకూడదని అన్నారు. ప్రేమ, శాంతి, సోదరభావం, పరస్పర గౌరవమే సమాజ అభివృద్ధికి పునాదని తెలిపారు. మత సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, సిహెచ్.భాస్కర్, షౌకత్ అలీ మున్నా, మల్లేష్, ఖాజా, ఖలీమ్, మహేష్, షకీర్, సత్తార్, యాస్మిన్, మోహాముద తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపురం గ్రామానికి విద్యుత్ స్తంభాలు, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారం

**తుర్కపల్లి 11 (వార్త వేదిక సూర్య ):**



తుర్కపల్లి మండలం లోని మల్కాపురం గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ స్తంభాలతో పాటు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో గ్రామంలో విద్యుత్ సదుపాయాల మెరుగుదలకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోన్నాయిల రఘు, ఉపసర్పంచ్ ఆకుల బాలయ్య, వార్డు సభ్యులు సత్తయ్య, నరేష్, రాజు, కావ్య, లావణ్య, లతతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



## సేవాలాల్ తండా గ్రామంలో శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మమ్మతల్లి వారిని దర్శించుకున్న జాలే నరసింహారెడ్డి

దేవరకొండ అక్టోబర్ 11 ( వార్త వేదిక సూర్య):-





చందంపేట మండలంలోని సేవాలాల్ తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మమ్మతల్లి విగ్రహాన్ని సుమారు 65,000రూ,, అక్షరాల అరవై ఐదు వేల రూపాయలతో ఇప్పించి నేడు శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మమ్మ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ సభ్యులు పిఎసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి

అనంతరం నరసింహారెడ్డి ఆ మహాలక్ష్మమ్మతల్లి వారి దివ్య ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గ ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు నరసింహారెడ్డి గారిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసి అడగగానే మంచి మనసుతో స్పందించిన జాలే బ్రదర్స్ నరసింహారెడ్డి తిలక్ రెడ్డి గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ వారిపై వారి కుటుంబ సభ్యుల పైన ఆ మహాలక్ష్మమ్మతల్లి ఆశీస్సులు ఉంటాయన్నారు

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, మాజీ సర్పంచ్ అంజయ్య, బావోజి సూర్య, ఇప్ప తిరుపతి రెడ్డి, వెంకులు, శ్రీను, ఆంజనేయులు, జబ్బర్, స్వామి, మంగు, మరియు తదితరులు పాల్గొన్నారు

## కాటేదాన్‌లో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

### కార్తీక్ రెడ్డి పోరాటాలకు ఆకర్షితులై గులాబీ గూటికి యువకులు, కార్యకర్తలు

రాజేంద్రనగర్, అక్టోంబర్ 11 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్, మోహన్ రెడ్డి నగర్, శ్రీరామ్ నగర్ బస్తీలకు చెందిన వివిధ పార్టీల యువకులు, కార్యకర్తలు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో, కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టు కోవడంలో విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశంలో కార్తీక్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న తీరు తమను ఆకట్టుకుందని తెలిపారు. భూసేకరణ పేరుతో పేదల భూములకు ముప్పు ఏర్పడుతున్న సమయంలో బాధితులకు అండగా నిలుస్తూ, ప్రజల పక్షాన పోరాడుతున్న కార్తీక్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్ ముదిరాజ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, రాము యాదవ్, మైసీ రెడ్డి, అక్కెం రఘు యాదవ్, కార్మిక విభాగం అధ్యక్షుడు ఉప్పల్ శ్రీను, రాజేష్ యాదవ్, రామస్వామి, మోహన్, ఆనంద్, భాస్కర్ నేత, మల్లేష్ నేత తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో సురేష్ ముదిరాజ్ బృందం, సాజిద్ బృందం, సయ్యద్ బృందం, కార్తీక్ బృందం, వినయ్ కుమార్ బృందానికి చెందిన యువకులు, కార్యకర్తలు ఉన్నారు.

# నిర్బంధం వద్దు.. చట్టవిరుద్ధ అరెస్టులూ వద్దు



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పౌరులు, ప్రతిపక్ష నాయకులతోపాటు న్యాయవాదులపైనా పోలీసులు అణచివేత ధోరణి ప్రదర్శించడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. నిరసనకారులను చట్టవిరుద్ధంగా నిర్బంధించడం గానీ, ప్రజా రవాణాను ఇష్టారాజ్యంగా నిలిపివేయడం గానీ చేయకూడదని తేల్చిచెప్పింది. 10వ తేదీన ఢిల్లీలో జరిగిన దాన్ని చిన్నవిషయంగా చూడటం లేదని పేర్కొంది. ట్రాఫిక్, మెట్రోపై ఇష్టారాజ్యంగా ఆంక్షలు చెల్లవని, పౌరుల స్వేచ్ఛా రాకపోకలను అనుమతించాలని ఆదేశించింది. అవసరమైన చోటే బారికేడ్లు పెట్టి, మిగతా వాటిని తొలగించాలని స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌కు అంతరాయం కలిగించవద్దని ఆదేశించింది. మెట్రోస్టేషన్లను మూసివేయవద్దని తాము ఆదేశించినా, ఎందుకు మూసివేశారని ప్రశ్నించింది. ఇది కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కిందకు ఎందుకు రాదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఢిల్లీలో మెట్రో, రైల్వే సర్వీసుల రద్దు, నిరసనకారుల అణచివేతపై పదుల సంఖ్యలో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బాగ్చి, జస్టిస్ మోహనలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. "మెట్రోలో ఒక మార్గంలో ప్రారంభ, చివరిస్టేషన్లను మాత్రమే తెరిచి.. మధ్యలో మూసివేస్తే రాకపోకలు ఎలా? ఏయే స్టేషన్లు తెరిచి ఉన్నాయి, ఏవి మూసేశారనే వివరాలను స్పష్టంగా మ్యాప్ ద్వారా నివేదికలో ఇవ్వండి" అని అధికారులను ధర్మాసనం ఆదేశించింది.

**పోలీసు రాజ్యంలా మారిపోయింది..**

పోలీసులు నిరసనకారులపై విచక్షణారహితంగా బలాన్ని ఉపయోగించారని, నేమ్‌బ్యాడ్జీలు కూడా పెట్టుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మహిళా నిరసనకారులతో పురుష పోలీసులు మర్యాద లేకుండా ప్రవర్తించారని ఆరోపించారు. తనవద్ద పనిచేసే ఒక మహిళా జూనియర్ న్యాయవాదిని పోలీసులు వ్యాన్‌లో తీసుకెళ్లి 11 కిలోమీటర్ల దూరంలో నిర్మానుష్య ప్రాంతంలో వదిలేశారని మాజీ అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ధర్మాసనానికి వివరించారు. పేశనివారం నాటి వాతావరణం చూస్తే దేశంలో పోలీసు రాజ్యం ఏర్పడటానికి ఒక్క అడుగు దూరంలోనే ఉన్నామనే భావన కలిగిందని సీనియర్ న్యాయవాది షాదన్ ఫరసాత్ వ్యాఖ్యానించారు.

**15శాతం మెట్రోస్టేషన్లు మాత్రమే మూసివేశాం: సొలిసిటర్ జనరల్**

నిర్బంధించిన వారిలో మెజారిటీ పౌరులను మధ్యాహ్నం 2గంటలకు అదుపులోకి తీసుకుని సాయంత్రం 6 గంటలకే విడుదల చేశామని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరణ ఇచ్చారు. అక్టోబరు 10న షెడ్యూల్ చేసిన 4,157 మెట్రోరైలు ట్రిప్పులను పూర్తిస్థాయిలో నడిపామని చెప్పారు. మొత్తం 303 స్టేషన్లలో కేవలం 15శాతం(45 స్టేషన్లు) మాత్రమే భద్రతా కారణాలతో మూసివేశామన్నారు. ప్రస్తుతం అన్ని మెట్రోస్టేషన్లు తెరిచి ఉన్నాయని, ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించామని ధర్మాసనానికి వివరించారు.

# రోడ్డు విస్తరణకు.. హీరో బాలకృష్ణ ఇంటి స్థలం!

### నాడు బాలయ్య కోసం.. ఎన్టీఆర్ కట్టించిన ఇల్లు

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్కు చుట్టూ వన్ వే ట్రాఫిక్ విధానం కోసం ప్రభుత్వం చేపట్టిన రహదారి విస్తరణకు తన ఇంటి స్థలాన్ని ఇచ్చేందుకు ప్రముఖ సినీ నటుడు, ఏపీలోని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ముందుకొచ్చారు. దాదాపు 862.77 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చేందుకు ఆయన అంగీకరిం చారు. దాంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ నుంచి కేబుల్ బ్రిడ్జి, దుర్గం చెరువు, నాలెడ్జ్ సిటీ వైపు వెళ్లేందుకు ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవనుంది. మరోవైపు కేబీఆర్ పార్కు ప్రధాన ప్రవేశ ద్వారం జంక్షన్ వద్ద ఉన్న తన స్థలాన్ని ఇచ్చేందుకు శబ్దాలయ స్టూడియో అంగీకరించింది.

జూబ్లీహిల్స్ లోపలి కాలనీలు, గచ్చిబౌలి, పశ్చిమ ఐటీ కారిడార్ ఫిల్మ్ నగర్ జంక్షన్‌ను అనుసంధానించేందుకు భవ్య కన్‌స్ట్రక్షన్ తన భూమిని ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఎలాంటి పరిహారం తీసుకోకుండా ట్రాన్స్ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)లతోనే స్థలాలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యకు స్వస్తి పలికేందుకు వన్ వే (ఒకే వైపు ప్రయాణం) విధానాన్ని ప్రవేశపెట్టగా అది విజయవంతమైంది. దీంతో ఈ విధానాన్నే శాశ్వతంగా అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అక్కడక్కడా చిన్న సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించి వాహనాలు వేగంగా వెళ్లేలా జీహెచ్‌ఎంసీ పనులు చేపట్టింది.

**ఎన్టీఆర్ తన అభిమానులను కలిసిన ఇల్లు..**

రోడ్డు విస్తరణ కోసం బాలకృష్ణ శబ్దాలయ స్టూడియో, భవ్య కన్‌స్ట్రక్షన్ ఇస్తున్న స్థలాలు గజం రూ.45 లక్షల వరకు పలుకుతున్నాయి. కీలకమైన ప్రాంతంలో ఉండటంతో ఇవి వ్యాపారానికి ఎంతో ఉపయుక్తమైనవి. బాలకృష్ణ కోసం ఆయన తండ్రి ఎన్టీఆర్ (చీ=) 1982లో ఈ ఇంటిని నిర్మించి ఇచ్చారు. దశాబ్దాలుగా బాలకృష్ణ ఆ ఇంట్లోనే ఉంటున్నారు. నందమూరి కుటుంబ వేడుకలకు ఆ ఇల్లు ఓ వేదిక. ఎన్టీఆర్ తన అభిమానులను ఇంట్లోనే కలిసేవారు. ఇంత అను బంధం ఉన్నప్పటికీ ప్రజా ప్రయోజనాల కోసం ఆ స్థలాన్ని ఇచ్చేందుకు బాలకృష్ణ అంగీకరించారు.

ప్రస్తుత పనులతో బాల కృష్ణ ఇంటిలోని ఓ భవనం సగానికి పైగా పోతోంది. దీంతో ఆయన ఇక్కడి నుంచి వేరే చో టుకు మారాల్సి వస్తోంది. అదేవిధంగా కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద శబ్దాలయ స్టూడియోకు చెందిన 608 చదరపు గజాల స్థలాన్ని ఫ్రీ-లెఫ్ట్ రోడ్డు విస్తరణ కోసం తీసుకుంటున్నారు. దీనివల్ల స్టూడియో ప్రహరీ గోడ పూర్తిగా పోవడంతో పాటు ప్రధాన భవనం వరకు పనులు సాగుతున్నాయి. ఫిల్మ్ నగర్ జంక్షన్ వద్ద రోడ్డును కొంత మార్చితే వాహనాలు లేన్ మారేందుకు ఆటంకాలు ఉండవు. ఇక్కడ పనుల కోసం భవ్య కన్‌స్ట్రక్షన్‌కు చెందిన సుమారు 34133 చదరపు గజాలు స్థలాన్ని తీసుకోనున్నారు. దీంతో ఆ సంస్థ భవనం పూర్తిగా పోతోంది.

**ఐదు జంక్షన్లు దాటేలా ఎలివేటెడ్ కారిడార్..**

ముఫఖంజా కాలేజీ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు 4.3 కిలోమీటర్ల దూరం ప్రతిపాదించిన 6 వరుసల ఎలివేటెడ్ కారిడార్ పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.1,090 కోట్లతో ఇక్కడ స్టీల్ ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం-1ను అనుసంధానించేలా ప్రత్యేక కనెక్టింగ్ ర్యాంప్ నిర్మిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ 5 ప్రధాన ట్రాఫిక్ జంక్షన్ల వద్ద ఆగే అవసరం ఉండదు. దీనికి బదులుగా రహ దారుల విస్తరణ చేపడితే ప్రైవేట్ ఆస్తుల సేకరణకే సుమారు రూ.1000 కోట్లు వెచ్చించాల్సి వచ్చేది.



## సిరిసిల్ల ఇంజనీరింగ్ కాలేజీ సమస్యలు పరిష్కరించండి: కేటీఆర్

**హైదరాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతితో మంజూరైన భవన నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉందన్నారు.

కాగా, కొడంగల్ అగ్రికల్చరల్ కాలేజీలో బీఎస్సీ సీటు సాధించిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని శ్రుతికి కేటీఆర్ రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే తమ కుటుంబానికి చదువు భారంగా మారిందని, సాయం చేయాలని ఎక్స్ వేదికగా శ్రుతి చేసిన విజ్ఞప్తిపై కేటీఆర్ స్పందించారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ ద్వారా ఆర్థిక సాయం పంపడమే కాకుండా.. విద్యార్థినితో ఫోన్లో మాట్లాడారు.

# అభిషేక్ ధనాధన్





### 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ

### అదరగొట్టిన అర్ష్‌దీప్

### మూడో టీ20లో విండీస్‌పై భారత్ గెలుపు

**ఇండోర్:** పరుగులు వెల్లువెత్తుతాయని భావించిన మూడో టీ20లో బంతికి, బ్యాట్‌కు మధ్య ఆసక్తికర పోరు జరిగింది. బౌండరీ విస్తీర్ణం తక్కువగా ఉన్న ఈ మైదానంలో మొదట భారత బ్యాటర్లు చేసింది 223 స్కోరు. ఇది ప్రత్యర్థికి తక్కువ లక్ష్యమే అని అనుకున్నా.. మన బౌలర్లు ఈసారి తమ పదును చూపించారు. కరీబియన్ల హిట్టింగ్‌కు ముకుతాడు వేశారు. దీంతో ఆదివారం జరిగిన ఈ మూడో టీ20లో భారత్ 14 పరుగుల తేడాతో గెలిచి సిర?సలో 2-1 ఆధిక్యం అందుకుంది. అభిషేక్ శర్మ (30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 69) తుఫాన్ ఇన్నింగ్స్ భారత్ గెలుపులో కీలకంగా నిలిచింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 37), తిలక్ వర్మ (28) రాణించారు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హెట్‌మయెర్ (26 బంతుల్లో 43), కమిల్ పూరన్ (42), స్ప్రింగర్ (11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 35 నాటౌట్), రూథర్‌ఫోర్డ్ (32) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌ద?పనకు 3, నమన్‌కు 2 వికెట్లు దక్కాయి. నాలుగో మ్యాచ్ బుధవారం హైదరాబాద్‌లో జరుగుతుంది.

దెబ్బతీసిన అర్ష్‌దీప్: ఛేదనలో విండ?సకు రెండో ఓవర్‌లోనే గట్టి షాక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ హోప్ (5)ను అర్ష్‌దీప్ బౌల్డ్ చేశాడు. అయితే కమిల్, హెట్‌మయెర్ ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరి జోరుకు పవర్‌ప్లేలో జట్టు 54/1 స్కోరుతో నిలిచింది. కానీ ఏడో ఓవర్‌లో హెట్‌మయెర్‌ను నమన్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పోవెల్ (5) మళ్లీ నిరాశపర్చగా.. 11వ ఓవర్‌లో కమిల్‌ను కూడా నమన్ దెబ్బతీశాడు. ఈ దశలో రూథర్‌ఫోర్డ్.. శాంప్సన్ సహకారంతో ఐదో వికెట్‌కు 46 పరుగులు జోడించాడు. 18వ ఓవర్‌లో పాల్, రూథర్‌ఫోర్డ్‌లను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో విండీస్ ఓటమి ఖరారైంది. చివరి ఓవర్‌లో స్ప్రింగర్ 6,4,6,6తో బాదుడు ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది.

ఆదుకున్న అభిషేక్-ఇషాన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆరంభంలో ఇబ్బందిపడినా.. ఓపెనర్ అభిషేక్, ఇషాన్‌ల ఎదురుదాడితో స్కోరు దూసుకెళ్లింది. రెండో వికెట్‌కు ఈ జోడీ 40 బంతుల్లోనే 108 పరుగులను నమోదు చేసింది. ఆ తర్వాత తిలక్, నితీశ్ (21), అక్షర్ (20) కాసేపు క్రీజులో నిలవడంతో స్కోరు 200 దాటగలిగింది. మరోవైపు ఫామ్‌లోకి వచ్చాడనుకున్న ఓపెనర్ సంజూ శాంసన్ (3)కు షాకిస్తూ అతడిని షమార్ జోసెఫ్ అవుట్ చేశాడు. అయితే మూడో ఓవర్‌లో అభిషేక్ 4,6,6తో గేరు మార్చాడు.

అటు ఇషాన్ సైతం పాల్ ఓవర్‌లో 3 ఫోర్లు రాబట్టడంతో స్కోరు గాడిన పడింది. ఆరో ఓవర్‌లోనూ అభిషేక్ 6,4,4తో చెలరేగి 18 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. మరోవైపు పవర్‌ప్లేలో భారత్ 87/1 రన్స్‌తో నిలిచింది. 8వ ఓవర్‌లోనే జట్టు స్కోరు వందకు చేరిన దశలో స్పిన్నర్ చేజ్ డబుల్ ఝలక్ ఇచ్చాడు. ఒకే ఓవర్‌లో ఇషాన్, శ్రేయాస్ (1)ల వికెట్లు తీశాడు. ఆ వెంటనే అభిషేక్, నమన్ (10) కూడా వరుస ఓవర్లలో పెవిలియన్ చేరారు. ఈ దశలో తిలక్, నితీశ్ జోడీ ఆరో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. అలాగే లోయరార్డర్‌లో ప్రిన్స్ (13 నాటౌట్), అర్ష్‌దీప్ (11) ఫర్వాలేదనిపించగా భారత్ సవాల్ విసిరే స్కోరందుకుంది.

**బౌండరీ వెళ్లిందనుకుని..**

జోరు మీదున్న తిలక్ వర్మ అనూహ్య రీతిలో రనౌట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. 17వ ఓవర్‌లో మోటీ వేసిన లో ఫుల్ టాస్‌ను అక్షర్ బలంగా ఆడాడు. సింగిల్ పూర్తి చేశాక వీరిద్దరు రెండో రన్ కోసం ప్రయత్నించారు. కానీ బంతి బౌండరీకి వెళ్లిందని భావించి తిలక్ తన పరుగును మధ్యలోనే ఆపి నెమ్మదిగా నాన్ స్ట్రయికింగ్ ఎండ్ వైపు నడుచుకుంటూ వచ్చాడు. అయితే అప్పటికే ఆ బంతిని అద్భుతంగా ఆపిన కమిల్.. కీపర్ హోప్‌నకు త్రో వేయగా తను బౌలర్ మోటీకి అందించాడు. అప్పటికి నింపాదిగా వస్తున్న తిలక్‌ను మోటీ రనౌట్ చేయడంతో షాక్‌కు గురయ్యాడు.

అంతర్జాతీయ టీ20ల్లో తక్కువ బంతుల్లో (1024) 2 వేల పరుగులు సాధించిన బ్యాటర్‌గా అభిషేక్. అలా గే ఒకే క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక సిక్సర్లు (68) బాదిన బ్యాటర్ (శాశ్వ త సభ్యదేశాల నుంచి)గా సూర్యకుమార్‌తో సంయుక్తంగా టాప్‌లో నిలిచాడు.

**స్కోరుబోర్డు:**

**భారత్:** శాంసన్ (సి) కమిల్ (బి) జోసెఫ్ 3, అభిషేక్ (సి అండ్ బి) స్ప్రింగర్ 69, ఇషాన్ (స్టంప్) హోప్ (బి) చేజ్ 37, శ్రేయాస్ (ఎల్బీ) చేజ్ 1, తిలక్ (రనౌట్) 28, నమన్ (సి) స్ప్రింగర్ (బి) మోటీ 10, నితీశ్ (సి) హోప్ (బి) పాల్ 21, అక్షర్ (రనౌట్) 20, అర్ష్‌దీప్ (ఎల్బీ) స్ప్రింగర్ 11, ప్రిన్స్ (నాటౌట్) 13, మయాంక్ (బి) జోసెఫ్ 0; ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 223 ఆలౌట్. వికెట్ల పతనం: 1-7, 2-115, 3-117, 4-124, 5-135, 6-169, 7-194, 8-202, 9-210, 10-223; బౌలింగ్: చేజ్ 4-0-38-2, జోసెఫ్ 4-0-54-2, పాల్ 4-0-38-1, స్ప్రింగర్ 4-0-50-2, మోటీ 4-0-37-1.

**వెస్టిండీస్:** హోప్ (బి) అర్ష్‌దీప్ 5, కమిల్ (సి) అర్ష్‌దీప్ (బి) నమన్ 42, హెట్‌మయెర్ (బి) నమన్ 43, పోవెల్ (సి) ఇషాన్ (బి) అక్షర్ 5, రూథర్‌ఫోర్డ్ (బి) అర్ష్‌దీప్ 32, శాంప్సన్ (సి) తిలక్ (బి) నితీశ్ 21, పాల్ (సి) తిలక్ (బి) అర్ష్‌దీప్ 10, స్ప్రింగర్ (నాటౌట్) 35, చేజ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 209/7. వికెట్ల పతనం: 1-7, 2-67, 3-82, 4-105, 5-151, 6-169, 7-174; బౌలింగ్: మయాంక్ 4-0-34-0, అర్ష్‌దీప్ 4-0-44-3, ప్రిన్స్ 4-0-37-0, నమన్ 3-0-39-2, అక్షర్ 3-0-33-1, నితీశ్ 2-0-19-1.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 144
సోమవారం
12 అక్టోబర్ 2026




# 'భోగి'లో పల్లె పరిమళం.. తొలి పాట విడుదల

చార్మింగ్ స్టార్ శర్వానంద్ కథానాయకుడిగా, సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ చిత్రం 'భోగి' నుంచి తొలి పాట 'ఎగిలివారంగ' విడుదలైంది. చిత్ర ప్రచారంలో భాగంగా విడుదల చేసిన ఈ జానపద గీతం సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి.

**జానపద బాణీకి చంద్రబోస్ సాహిత్యం**

'ఎగిలివారంగ' పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ సాహిత్యం సమకూర్చారు. నల్గొండ గద్దర్ నరసన్న, కందుకూరి శంకర్ బాబు, రేలారే గోపాల్ తమ గాత్రంతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విడుదలైన పోస్టర్‌లో పండుగ వాతావరణం ప్రతిబింబిస్తోంది.

**పల్లె ఆత్మను పలకరించే జ్ఞాపకం**

ఈ పాటను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న దర్శకుడు సంపత్ నంది.. ఇది కేవలం పాట మాత్రమే కాదని, ప్రతి పల్లె ఆత్మను పలకరించే మధురమైన జ్ఞాపకమని పేర్కొన్నారు. చంద్రబోస్ భావాలు, భీమ్స్ రాగాలు కలసి ఈ గీతానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయని తెలిపారు.

**నవంబరు 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల**

1960ల నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా టీజర్ ఇప్పటికే యూట్యూబ్‌లో కోటిన్నర వీక్షణలను దాటినట్లు చిత్రబృందం వెల్లడించింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె. రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 'భోగి'ని నవంబరు 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# వాయిదా దిశగా ప్రభాస్ 'ఫౌజీ'?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' విడుదల తేదీపై కొత్త ప్రచారం మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని తొలుత డిసెంబరు 3న విడుదల చేయాలని భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఈ సినిమాను వాయిదా వేసి, 2027 మార్చి 18న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

**కీలక దశలో చిత్రీకరణ**

'ఫౌజీ' చిత్రీకరణ ప్రస్తుతం కీలక దశలో ఉన్నట్లు సమాచారం. సినిమాలోని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణపై చిత్రబృందం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఆలయ నేపథ్యంతో రూపొందించిన ప్రత్యేక సెట్‌లో ఇంటర్వెల్ పోరాట ఘట్టాన్ని చిత్రీకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నవంబరు 15 నుంచి క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారని, డిసెంబరు మొదటి వారానికల్లా ప్రభాస్‌కు సంబంధించిన ప్రధాన సన్నివేశాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.

**పుట్టినరోజున ప్రత్యేక కానుక?**

అక్టోబరు 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా 'ఫౌజీ' నుంచి ప్రత్యేక గ్లింప్స్ లేదా టీజర్‌ను విడుదల చేయనున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే పుట్టినరోజు కానుకగా ఏ వీడియోను విడుదల చేస్తారనే విషయంపై స్పష్టత లేదు. ప్రభాస్ కొత్త లుక్, పాత్ర స్వభావం, యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన దృశ్యాలు బయటకు వస్తే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

**ప్రభాస్ యాక్షన్‌పై భారీ అంచనాలు**

'ఫౌజీ'లో ప్రభాస్ యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని ప్రచారం జరుగుతోంది. కొన్ని పోరాట ఘట్టాలను ఆయన డూప్ లేకుండా స్వయంగా చేసినట్లు వార్తలు వినిపిస్తున్నప్పటికీ, చిత్రబృందం నుంచి అధికారిక ధ్రువీకరణ లేదు. విడుదల తేదీ, చిత్రీకరణ షెడ్యూల్, పుట్టినరోజు ప్రత్యేక కార్యక్రమాలపై అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

# స్వేచ్ఛే నా అసలు రూపం



గ్లామర్ లోకంలో ఎంత ఎత్తుకు ఎదిగినా.. ఆడంబరాల వెనుక ఉన్న తన అసలైన రూపాన్ని, లోపలి పసితనాన్ని కాపాడుకోవడమే అసలైన అందమని అంటోంది నటి అదితిరావు హైదరి. ఫ్యాషన్ ప్రపంచపు అంచులు.. వెండితెర వెలుగుల వెనుక తనలోని నర్తకిని, ఆత్మవిశ్వాసాన్ని కాపాడుకుంటూ తన గళాన్ని విప్పిన తీరును తాజాగా 'ఫెమినా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకుంది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

ఫొటోషూట్ సమయంలో నేను ధరించిన బ్లాక్ కార్సెట్ డ్రెస్ ఎంతో అద్భుతంగా, ఆర్కిటెక్చరల్ డిజైన్‌తో చెక్కినట్టుగా ఉంది. అయితే, మూడో లేదా నాలుగో అవుట్‌ఫిట్ మారే సమయానికి కాళ్లకు ఉన్న ఎత్తైన హీల్స్ విప్పేసి, తదుపరి షాట్ కోసం ఒట్టికాళ్లతో నిలబడొచ్చా? అని అడిగాను. ఆ నిమిషంలో నా కాళ్లకు ఉన్న చెప్పులు తీసేసి నేలపై పాదాలు మోపగానే నాలో ఏదో తెలియని మార్పు వచ్చింది. ఏదో నటనాత్మకమైన భంగిమలా కాకుండా ఆ దుస్తులతో, ఆ క్షణంతో ఒక ఆత్మీయ బంధం ఏర్పడినట్టు అనిపించింది. నేను ఐదేళ్ల పసివయసు నుంచే శాస్త్రీయ నృత్య సాధన చేస్తున్నాను. అందుకే నా శరీరంతో నేను ఎప్పుడూ ఎంతో సౌకర్యంగా ఉంటాను. శరీరాన్ని సిగ్గుపడేలాగా లేదా దాచుకోవాల్సిన దానిగా నేను ఎప్పుడూ చూడలేదు. నృత్యం నా శరీరానికి ఒక స్వేచ్ఛను ఇచ్చింది.

**సహజత్వానికి పట్టాభిషేకం**

నేను ఏ దుస్తులు ధరించినా, ఒక పాత్రలో నటించినా లేదా రెడ్‌కార్పెట్‌పై నడిచినా.. అందులో నా అసలైన ముద్ర ఉండాలని కోరుకుంటాను. నాకు వాటితో ఒక భావోద్వేగ అనుబంధం ఏర్పడాలి. 'ఈ దుస్తులు నాకు చెందుతాయి. నేను వీటికి చెందుతాను' అనే భావన కలిగినప్పుడే మానసికంగా దానికి కనెక్ట్ కాగలను. తెరపై కనిపించే మెరుపుల వెనుక ఒక సాదాసీదా మహిళ ఉంది. రోజూ ఉదయం లేవగానే నేనేమీ లెహంగాలు, షరారాలు వేసుకోను. ఇంట్లో ఎప్పుడూ ఒట్టి కాళ్లతోనే తిరిగే సరదా మనిషిని. నా చుట్టూ ఉన్న వాళ్లని సరదాగా తెలియకుండానే నవ్వించే అలవాటు నాకుంది. పరిశ్రమలోకి రాకముందు, రెడ్‌కార్పెట్ మెరుపులు చూడకముందు, నా నటనపై ఇతరులు అభిప్రాయాలు చెప్పకముందు నాలో ఉన్న ఆ సహజమైన అదితిని కాపాడుకోడమే ముఖ్యమైన విషయం. అమ్మ నేర్పిన విద్య.. అమూల్యమైన వారసత్వం, నాలోని ఐదేళ్ల చిన్నారి కుతూహలం, ఆశలు, కలలు కనే తత్వం ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. నా తల్లి, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు విద్యారావు, అలాగే నాయనమ్మ, విద్యావేత్త శాంతా రామేశ్వర్‌రావు నుంచి నాకు కళలు, సంగీతం, పుస్తకాలు, కథలు వారసత్వంగా వచ్చాయి. నా చిన్నతనం అంతా నాట్యం, సంగీతం, అద్భుతమైన కథల నడుమ ఒక వర్ణ రంజితమైన ప్రపంచంలో గడిచింది. ఇవిలేని జీవితాన్ని నేను ఊహించుకోలేను. వారు నాకు కళలను మాత్రమే ఇవ్వలేదు. ఒక గొప్ప జీవన దృక్పథాన్ని ఇచ్చారు. నా చిన్నతనంలో అమ్మ చెప్పిన మాట ఇప్పటికీ గుర్తుంది. "నువ్వు నిజమైన కళాకారిణివి అయితే నిన్ను ఎవరూ తగ్గించలేరు. జీవితంలో ఎత్తు పల్లాలు వచ్చినా.. నీలోని సృజనాత్మకతే నీ అతిపెద్ద బహుమతి" అని అమ్మ చెప్పిన మాటలు నా జీవితానికి, కెరీర్‌కు దిక్సూచిగా మారాయి.

**'మణిరత్నం హీరోయిన్' కల**

గతాన్ని తలచుకోవడానికి నేను పెద్దగా ఇష్టపడను. వర్తమానంలో జీవిస్తూ, కొత్త అనుభవాల కోసం, భవిష్యత్తు కోసం ఆశగా ఎదురుచూస్తుంటాను. అయితే, నా పదేళ్ల వయసులో కన్న ఒక గొప్ప కల నన్ను నిరంతరం వెంటాడేది. అప్పట్లో 'బొంబాయి' సినిమాలోని ఒక పాట చూసి, మణిరత్నం మాయాజాలంలో, ఏఆర్ రెహమాన్ సంగీతంలో, రాజీవ్ మీనన్ ఛాయాగ్రహణంలో పడిపోయాను. ఎలాగైనా ఆయన దర్శకత్వంలో నటించి 'మణిరత్నం హీరోయిన్' కావాలని కలలు కన్నాను. 2017లో 'కాట్రు వెళియిడై' (చెలియా) ద్వారా ఆ కల నిజమైంది. ఆయనతో పనిచేయడం నా జీవితాన్ని అన్ని విధాలా మార్చేసింది. చిన్నప్పుడు కన్న కలలు నిజమవుతాయని నాపై నాకు నమ్మకాన్ని ఇచ్చింది. ఆ అనుభవం నాలోని ఆ చిన్నారి ఉత్సాహానికి, అన్వేషణకు ఒక గుర్తింపును, విశ్వాసాన్ని నింపింది.

**సినిమాల ఎంపిక వెనుక**

సినిమాలను ఎంచుకోవడంలో నాకు ఎలాంటి నియమావళి ఉండదు. ఒక కథ విన్నప్పుడు నాలో కలిగే ఆ ఉత్తేజం, ఒత్తిడి ఆధారంగానే నిర్ణయం తీసుకుంటాను. దర్శకుడి భావన, ఆ సృజనాత్మక ప్రపంచం నన్ను కట్టిపడేయాలి. నా కడుపులో సీతాకోక చిలుకలు ఎగిరినట్టుగా ఒక వింత భావన కలిగి, ఆ సృష్టికర్త విజన్‌కు నన్ను నేను అప్పగించుకోవాలని అనిపిస్తే చాలు.. నేను ఆ ప్రాజెక్టులోకి దిగిపోతాను. 'శృంగారం'తో నా నటనా ప్రస్థానం మొదలై, రీసెంట్‌గా 'హీరామండి'లో బిబ్బోజాన్ వరకు నా పాత్రలు సంగీతం, నృత్యంతో ముడిపడి ఉన్నాయి. ఒక సినిమా గెలుపోటముల కంటే తరతరాలుగా ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయే సినిమాత్మక వారసత్వంలో భాగం కావడమే నా అంతిమ లక్ష్యం.

**ఆంతరంగిక శాంతి**

నా ఉనికి, నా ఆత్మగౌరవం కెమెరా వెలుగులతో ముగిసిపోయేవి కావు. ప్రతి ఉదయం సంతోషంగా నిద్రలేవడం, రాత్రి కృతజ్ఞతతో నిద్రపోవడంలోనే అసలైన ఆనందం ఉంది. చుట్టూ ఎంతటి గందరగోళం, శబ్దం ఉన్నా నా మనసులో ఒక మధురమైన సంగీతాన్ని వినడానికి ప్రయత్నిస్తాను. నా తోటి మహిళలందరికీ నేను చెప్పేది ఒకటే.. జీవితంలో మీరు ఎన్ని పాత్రలు పోషిస్తున్నా.. మీ కోసం మీరు ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టించుకోండి. మీలోని చిన్నారిని సజీవంగా ఉంచడానికి నాట్యం, పాట, చిత్రలేఖనం, పరుగు, పియానో వాయించడం లేదా ఒంటరిగా సముద్రపు అలలను చూడటం.. ఏదో ఒక పనిని కేవలం మీ ఆంతరంగిక సంతోషం కోసం ప్రతిరోజూ చేయండి. అదే మీకు నిజమైన స్వేచ్ఛను, ఆనందాన్ని ఇస్తుంది.

**భయం.. ధైర్యం కలబోత**

దర్శకుడు ఇంతియాజ్ అలీతో పనిచేయాలనేది నా పాత కల. కానీ, 'ఓ సాథీ రే' స్క్రిప్ట్ మొదట చదివినప్పుడు అందులోని కంటెంట్ నా తలకు ఎక్కక నేను ఆ సినిమా చేయలేనని తిరస్కరించాను. ఆ తర్వాత ఆయన వచ్చి ఆ పాత్రల స్వభావాన్ని, ఆ ప్రపంచంలో ఉండే సృజనాత్మక గందరగోళాన్ని వివరించినప్పుడు నాలో భయంతో కూడిన ఒకరకమైన ధైర్యం వచ్చింది. అలాగే 'లస్ట్ స్టోరీస్ 3'లో విశాల్ భరద్వాజ్‌తో, నా భర్త సిద్ధార్థ్‌తో కలిసి నటించడం ఒక అద్భుతమైన అనుభవం. సిద్ధార్థ్ ఎప్పుడూ ఒక అద్భుతమైన కోస్టార్. కెమెరా ముందు బాధ, కోపం, ప్రేమ, ఆకాంక్షలు వంటి అత్యంత సున్నితమైన భావోద్వేగాలను ఎలాంటి సంకోచం లేకుండా ఆవిష్కరించడం నటులకు మాత్రమే దక్కిన ప్రత్యేక కళ.



# గాయత్రి సురేష్ షాకింగ్ కామెంట్స్..



ప్రముఖ మలయాళ నటి గాయత్రి సురేష్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సంచలన విషయాలను వెల్లడించింది. ప్రస్తుతం 'బిగ్‌బాస్ మలయాళం' ఎనిమిదో సీజన్‌లో పాల్గొన్న ఆమె శనివారం ప్రసారమైన ఎపిసోడ్‌లో ఎలిమినేట్ అయింది. షో నుంచి బయటకు వెళ్లే ముందు ఓ టాస్క్‌లో భాగంగా తన గతంలోని చేదు అనుభవాలను గాయత్రి పంచుకుంది.

**మాజీ ప్రియుడి గురించి**

**2021లో ఎదురైన చేదు అనుభవం**

2015లో 'జమ్నా ప్యారీ' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన గాయత్రి.. 2021లో తాను ఓ వివాదంలో చిక్కుకున్న సమయంలో ఓ వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నానని తెలిపింది. ఆ బంధం మొదలైన మొదటి వారంలోనే సదరు వ్యక్తి తనను తీవ్రంగా బాధించేలా ఓ ప్రశ్న అడిగాడని చెప్పింది. ఆ మాటతోనే అతడి వ్యక్తిత్వంపై తనకు స్పష్టత వచ్చిందని, అప్పటి నుంచి అతడితో మాట్లాడటం మానేశానని పేర్కొంది.



తన జీవితంలో చాలామంది బాధపెట్టినా, 2021లో జరిగిన సంఘటన మాత్రం తనను తీవ్రంగా గాయపరిచిందని గాయత్రి తెలిపింది. తాను పరిపూర్ణమైన వ్యక్తిని కాదని, తనలోనూ కొన్ని చెడు అలవాట్లు ఉన్నాయని అంగీకరించిన ఆమె.. అయితే తన మనసు స్వచ్ఛమైనదని, ఎవరినీ కావాలని బాధపెట్టాలని అనుకోనని చెప్పింది.

**కారు ప్రమాదం.. మరింత బాధ**

అదే సమయంలో జరిగిన కారు ప్రమాదం గురించి కూడా గాయత్రి వివరించింది. 2021 అక్టోబరులో తన స్నేహితురాలితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపింది. ఆ సమయంలో తన స్నేహితురాలే కారు నడుపుతున్నారని, మరో వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుందని చెప్పింది. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రమాదం అనంతరం పోలీసులు తనతో ఉన్న వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని గాయత్రి తెలిపింది. అతను తిరిగి వచ్చిన తర్వాత తనను ఓ కేఫ్‌లో ఒంటరిగా వదిలి తన ప్రియురాలిని కలవడానికి వెళ్లాడని చెప్పింది. ఆ ఘటన తనను తీవ్రంగా బాధించిందని, చివరకు ఆ వ్యక్తికి దూరమయ్యానని గాయత్రి వెల్లడించింది.

**వైరల్‌గా మారిన గాయత్రి వ్యాఖ్యలు**

'బిగ్‌బాస్'లో గాయత్రి చెప్పిన ఈ విషయాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా తన గత సంబంధం, కారు ప్రమాదం, ఆ తర్వాత ఎదురైన పరిస్థితుల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు చర్చించుకుంటున్నారు. షో నుంచి ఎలిమినేట్ అయిన వెంటనే గాయత్రి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఈ వ్యాఖ్యలు మరోసారి వార్తల్లో నిలిచాయి.

Printed, Published and Owned by POLOJU SRINIVASA CHARY, and Printed at SURYA DIGITAL PRINTERS, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State -508252. Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305, Cell:9985389183. EmailId:vaarthavedhikasurya2025@gmail.com